ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
కాకినాడ
జిల్లా వార్తలు
శుక్రవారం 23 ఆగస్టు 2024 | 5

## లేమ్మా... హారికా

- మమ్మల్ని విడిచి వెళ్లిపోయావా
- కన్నీరుమున్నీరైన కుటుంబ సభ్యులు

- 7లో

## కోనసీమలో నేడు సీఎం పర్యటన

- 7లో

## జానపద కళాకారుల ర్యాలీ

- కాకినాడలో ప్రపంచ జానపద దినోత్సవం

బుర్రకథ.. హరికథ.. తోలుబొమ్మలాట.. నెమలి నృత్యం.. పులి వేషం.. పగటివేషం.. డప్పు.. తప్పెటగుళ్లు.. ఒగ్గుకథ.. యక్షగానం.. వీధి భాగోతం.. ఇలా ఇంకా ఎన్నో జానపద కళారూపాలు అంతరించిపోతున్నాయి.. నేటితరానికి వీటి గురించి పరిచయమే లేదు.

కలెక్టరేట్(కాకినాడ), ఆగస్టు 22: ప్రపంచ జానపద దినోత్సవం సందర్భంగా గురువారం కాకినాడ కలెక్టరేట్‌నుంచి బాలాజీ సెంటర్‌వరకు జానపద కళాకారులు చేపట్టిన ర్యాలీని డీఆర్‌వో తిప్పేనాయక్ ప్రారంభించారు. ప్రస్తుతం సోషల్‌మీడియా ప్రభావం ఎక్కువైనందున ఇలాంటి కళలు కనుమరుగువుతున్నాయని, ప్రతిఏటా జానపద ఉత్సవాల నిర్వహణ ద్వారా ఈకళలను ప్రజల హృదయాల్లో సజీవంగా ఉంచవచ్చని ఆయన అభిప్రాయ పడ్డారు. జిల్లా సమాచారశాఖ డీడీ నాగార్జున, జానపద కళాకారుల సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కృష్ణబాబు, సంఘ కాకినాడ అధ్యక్షుడు వీరనాలకృష్ణ, ప్రధాన కార్యదర్శి పవన్‌కుమార్, జిల్లా కోశాధికారి ప్రకాష్‌రాజు పాల్గొన్నారు.



వివిధ వేషధారణల్లో ప్రదర్శనలు ఇస్తున్న జానపద కళాకారులు



శ్రీరాముడు, ఆంజనేయుల వేషధారణల్లో చిన్నారులు



పగటి వేషగాడిగా కొరడాతో జానపద కళాకారుడు

# ‘బ్లాక్’ దందా!



- ఎమ్మార్పీ కంటే అధిక ధరలకు ఎరువులు విక్రయాలు
- యూరియా, డీఏపీ కావాలంటే ఆ మందులూ కొనాల్సిందే
- కంపెనీలు, సూపర్‌స్టాకిస్టులు, హోల్‌సేలర్ల దగ్గరే ఈ పరిస్థితి
- ఎరువుల దుకాణదారులకు కొనక తప్పని పరిస్థితి
- గ్రామాలు, పట్టణాల్లో యూరియా రూ.325, డీఏపీ రూ.1450-1500కి విక్రయం
- రైతులపై అదనపు భారం
- కీలక పాత్రధారులను వదిలేస్తున్న వ్యవసాయశాఖ

**సార్వా సీజన్‌లో పంటలకు ఎరువులు కావాల్సిన కీలక తరుణం.. అంతే కంపెనీలు, సూపర్ స్టాకిస్టులు, హోల్‌సేల్ డీలర్లు సరికొత్త దందాకు తెరలేపారు. మేము చెప్పిన ధరకు యూరియా, డీఏపీ కొనాల్సిందే. అదే సమయంలో లింక్ మందులు తీసుకోవాల్సిందే అంటూ గ్రామాల్లో డీలర్లపై ఒత్తిడి తెస్తున్నారు. రవాణా చార్జీలు భరించాల్సిన కంపెనీలు ఆ భారాన్ని డీలర్లపై వేస్తున్నాయి. వెరసి రైతులు బస్తాకు రూ.60 నుంచి రూ.150 వరకూ అదనంగా వెచ్చించి ఎరువులు కొనాల్సి వస్తోంది. ఆ పై లింక్ మందులు అంటకడుతున్నారు. ఈ బ్లాక్ మార్కెట్ దందాపై చర్యలు తీసుకోవాల్సిన వ్యవసాయశాఖ ఉన్నతాధికారులు చిన్న డీలర్లపై కేసులు నమోదు చేస్తూ కీలక పాత్రధారులను వదిలేస్తున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. వ్యవసాయశాఖ కమిషనరేట్‌లోని కొందరు అధికారులు ఈ దందాకు సహకరిస్తున్నట్లు ఆరోపణలున్నాయి.**

**(ఆంధ్రజ్యోతి, కాకినాడ)**

సార్వా సీజన్‌లో ప్రస్తుతం సాగవుతున్న వరితోపాటు ఇతర పంటలకు ఎరువులు వేయాల్సిన కీలక తరుణం ఇది. యూరియాతోపాటు డీఏపీని రైతులు అధికంగా వినియోగిస్తారు. ఈ సమయంలో ఎరువులు వేయకుంటే దాని ప్రభావం పంట ఎదుగుదలపై చూపిస్తుంది. సరిగా దీన్నే కంపెనీలు, బడా వ్యాపారులు ఆసరాగా తీసుకుని ఎరువుల్లో బ్లాక్‌మార్కెట్ దందాకు తెరలేపారు. నీమ్ యూరియా 50 కిలోల బస్తాను రూ.266.50కు, డీఏపీని రూ.1350కి విక్రయించాల్సి ఉంటుంది. ఈ ధరలకు జిల్లాలోని గ్రామాలు, పట్టణాల్లోని ఎరువుల దుకాణాల్లో ఎక్కడా యూరియా, డీఏపీ దొరకడం లేదు. యూరియాను బస్తా ఒక్కింటికి రూ.300 నుంచి రూ.325కు, డీఏపీని రూ.1450 నుంచి రూ.1500కు విక్రయిస్తున్నారు. వీటితోపాటు గ్రోత్ ప్రమోటర్ లేదా నానో యూరియా లిక్విడ్, నానో డీఏపీ లిక్విడ్‌లను రైతులకు అంటగడుతున్నారు. సొసైటీలకు వచ్చే ఎరువులను మాత్రం ఎమ్మార్పీ ధరలకు విక్రయిస్తున్నారు. ఇది రైతుల అవసరాలను కేవలం 5శాతం మాత్రమే తీర్చగలుగుతున్నాయి.

### ఎరువుల సరఫరా ఎలా..

సాధారణంగా ఎరువులు తయారు చేసే కంపెనీలు తమ ఉత్పత్తులను సూపర్‌స్టాకిస్టులు, హోల్‌సేలర్స్ ద్వారా విక్రయిస్తుంటాయి. అక్కడినుంచి గ్రామాలు, పట్టణాల్లో ఉన్న ఎరువుల దుకాణాలకు అమ్మకాలు సాగిస్తారు. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో కాకినాడ, పెద్దాపురం, మండపేట, రాజమహేంద్రవరం, రావులపాలెం తదితర ప్రాంతాల్లో సూపర్ స్టాకిస్టులు, హోల్‌సేలర్లు ఉన్నారు. ఎరువుల విక్రయాల్లో వీరి చెప్పిందే ధర అన్నరీతిలో సాగుతోంది. వీరు చెప్పిన ధరకే ఎరువుల దుకాణదారులు కొని తిరిగి రైతులకు అమ్ముతారు. ఎక్కువగా ఎరువుల విక్రయాలు సాగించే దుకాణదారులు నేరుగా కంపెనీలు నుంచే కొనుగోళ్లు సాగిస్తారు.

### ఇప్పుడు ఏం జరుగుతోందంటే..

సాధారణంగా కంపెనీలు ఉత్పత్తి వ్యయంపై కొంత మార్జిన్ వేసుకుని సూపర్‌స్టాకిస్టులు, హోల్‌సేల్ డీలర్లకు ఎరువులు విక్రయిస్తే, వారు మరికొంత లాభంతో వీటిని రిటైల్ డీలర్లకు విక్రయిస్తారు. గ్రామాలు, పట్టణాల్లోని ఎరువుల డీలర్లు ఈ ఎరువులను ఎమ్మార్పీకే రైతులకు విక్రయించాల్సిఉంది. ఇప్పుడు కంపెనీలు, సూపర్‌స్టాకిస్టులు, హోల్‌సేల్ డీలర్లు అంతా కలిపి ఎరువులకు కృత్రిమ కొరత సృష్టించడం ప్రారంభించారు. ఎరువులు వేయాల్సిన కీలక తరుణం కావడంతో రైతులు అధిక ధరలకు అయినా కొంటారని భావించి బ్లాక్‌మార్కెట్ దందాకు తెరలేపారు. ఇందులో కొన్ని కంపెనీల ఉన్నతాధికారులు కీలకపాత్ర పోషిస్తున్నారు. వీరు సూపర్‌స్టాకిస్టులు, హోల్‌సేలర్ల ద్వారా ఈ దందా సాగిస్తున్నారనే ఆరోపణలున్నాయి. హోల్‌సేల్ డీలర్లు గ్రామాలు, పట్టణాల్లోని దుకాణదారులకు యూరియా, డీఏపీని ఎమ్మార్పీ కంటే అధిక ధరలకు విక్రయిస్తున్నారు. వీరివద్దే యూరియా బస్తాను రూ.290కి, డీఏపీని రూ.1400కి విక్రయిస్తున్నట్లు సమాచారం. లారీకి రూ.15వేల నుంచి రూ.20వేల విలువ చేసే గ్రోత్ ప్రమోటర్లు, నానో యూరియా, నానో డీఏపీ లిక్విడ్‌లను అదనంగా అంటగడుతున్నారు. లేకుంటే స్టాకు ఇచ్చేది లేదని చెప్పడంతో రిటైల్ దుకాణదారులు వారు చెప్పిన ధరకే కొని లింక్ మందులనూ విక్రయిస్తున్నారు.

### రవాణా చార్జీలు దుకాణదారులపైనే..

నిబంధనల ప్రకారం కంపెనీ లేదా సూపర్‌స్టాకిస్ట్ లేదా హోల్‌సేలర్ యూరియా లేదా డీఏపీ లేదా ఇతర ఎరువులను విక్రయించినప్పుడు రవాణా చార్జీలను వారే భరించి స్టాకును రిటైల్ దుకాణం వద్దకు చేర్చాలి. ప్రస్తుత డిమాండ్‌ను దృష్టిలో ఉంచుకుని ఆ భారాన్ని రిటైల్ డీలర్లపై వేస్తున్నారు. దీంతో ఎరువుల ధర మరింత అధికమవుతోంది. దీంతో యూరియాను ఎమ్మార్పీ కంటే రూ.35 నుంచి రూ.60, డీఏపీని రూ.100 నుంచి రూ.150కు అధికంగా రిటైల్ ఎరువుల దుకాణదారులు విక్రయిస్తున్నారు. ఈ ధరలకు యూరియా, డీఏపీ విక్రయించడంతోపాటు లింక్ మందులు కొనాలంటున్నారు.దీంతో రైతులు గత్యంతరంలేక ఆ ధరలకు కొంటున్నారు.

### వ్యవసాయశాఖ తీరుపై ఆరోపణలు

ఎరువులు బ్లాక్‌మార్కెట్ దందాను నియంత్రించాల్సిన వ్యవసాయశాఖ అందులో పూర్తిగా విఫలమైందనే ఆరోపణలున్నాయి. ఎరువుల తయారీ కంపెనీలు, సూపర్‌స్టాకిస్టులు, హోల్‌సేలర్స్ దగ్గరే ఎరువులను ఎమ్మార్పీ కంటే అధిక ధరలకు విక్రయం, లింక్ మందులు అమ్మకం, రవాణా చార్జీలను రిటైలర్లపై వేయడం వంటివి జరుగుతున్నా వారిపై చర్యలు తీసుకోవడం లేదనే విమర్శలున్నాయి. గ్రామాల్లో ఉండే చిన్న దుకాణదారులపై మాత్రం తమ ప్రతాపం చూపిస్తూ వారిపైనే కేసులు నమోదు చేస్తున్నారు. కంపెనీలు, స్టాకిస్టులు, హోల్‌సేలర్లు సిండికేట్ అయి ఎరువులను బ్లాక్‌మార్కెట్ చేస్తున్నా వ్యవసాయశాఖ ఉన్నతాధికారులు ఎందుకు చర్యలు తీసుకోలేకపోతున్నారని రైతు సంఘాల ప్రతినిధులు ప్రశ్నిస్తున్నారు. ఈ బ్లాక్ మార్కెట్ దందాలో వ్యవసాయశాఖ కమిషనరేట్ అధికారులతోపాటు జిల్లాల వ్యవసాయశాఖ ఉన్నతాధికారుల పాత్ర ఉందని వారు ఆరోపిస్తున్నారు.

## నేడు జిల్లాలోని 385 పంచాయతీల్లో గ్రామసభలు



కార్పొరేషన్(కాకినాడ), ఆగస్టు22: జిల్లాలోని 385 గ్రామ పంచాయతీల్లో శుక్రవారం ఆయా గ్రామ సర్పంచ్‌ల అధ్యక్షతన గ్రామసభలు జరగనున్నాయి. వీటికి సంబంధిత పంచాయతీ కార్యదర్శి నేతృత్వం వహించాల్సి ఉంది. కార్యదర్శులు లేనిచోట గ్రేడ్-5, 6 కార్యదర్శిని నియమిస్తారు. ప్రతిగ్రామ పంచాయతీలోనూ గ్రామ సభ నిర్వహణకు ఒక మండల స్థాయి అధికారి ప్రత్యేకాధికారిగా ఉంటారు. గ్రామసభను పంచాయతీ కార్యాలయాల్లో లేదా అందరికీ అనువైన ప్రదేశంలోగానీ ప్రభుత్వ భవనం, సామాజిక భవనాల్లో మాత్రమే నిర్వహించాలని కలెక్టర్ ఆదేశించారు. ఈ సభలకు ఉపాధి హామీ వేతనదారులు, గ్రామపెద్దలు, యువకులు, మహిళలు, డ్వాక్రా సభ్యులు హాజరై గ్రామాల్లో కావాల్సిన అవసరాలను గుర్తించాల్సి ఉంది. గ్రామసభలో మొదటిప్రాధాన్యంగా సీసీ రోడ్లు, సీసీ డ్రైన్లు, ఇతరపనులు గుర్తించి చర్చించనున్నారు.

## జిల్లాలో భారీవర్షం

కాకినాడ సిటీ, ఆగస్టు 22: జిల్లాలో గురువారం భారీవర్షం కురిసింది. కాకినాడ నగరంతోపాటు పలుచోట్ల ఉరుములు, మెరుపులతో కూడిన వర్షంవల్ల రోడ్లపై నీరు నిలిచిపోయింది. మధ్యాహ్నం 12గంటల సమయంలో ఒక్కసారిగా భారీవర్షం కురిసింది. లోతట్టు ప్రాంతాలు వర్షం ధాటికి నీటమునిగాయి.



కాకినాడ నగరంలో కలెక్టర్ బంగ్లా వద్ద ధాటిగా పడుతున్న వర్షం



కాకినాడలో టూటౌన్ పోలీస్‌స్టేషన్ ఎదురుగా నిలిచిన వర్షపు నీరు

## నేడు జాతీయ అంతరిక్ష దినోత్సవం

- చంద్రయాన్-3 విజయానికి గుర్తుగా వేడుకలు
- అన్ని పాఠశాలల్లో నిర్వహణకు ఆదేశాలు



తొండంగి, ఆగస్టు 22: అల్లంత దూరాన ఉన్న చందమామను అందిపుచ్చుకున్న రోజది.. 2023, ఆగస్టు 23.. ఆరోజున చంద్రయాన్-3 విజయవంతమైంది. భారతీయుల అందరి మదిలో పదిలంగా దాచుకునేందుకు వీలుగా ఈరోజును జాతీయ అంతరిక్ష దినోత్సవంగా నిర్వహిస్తున్నారు. ఈ విజయాన్ని అందరిలో స్ఫూర్తి నింపేందుకు వీలుగా చంద్రయాన్ విజయం సాధించిన ఏడాదికి వచ్చిన 2024ను ‘చంద్రుడిని స్పృశించినపుడు-జీవితాలను స్పృశించవచ్చు’ అనే ఇతివృత్తంగా ఈఏడాది కేంద్ర ప్రభుత్వం ప్రకటించింది. చంద్రయాన్ విజయ స్ఫూర్తిని విద్యార్థుల్లో నింపేందుకు, వారిలో అంతరిక్షంపట్ల విశ్వరహస్యాలపై మక్కువ పెంచేందుకు వీలుగా జిల్లాలోని అన్ని పాఠశాలలు, శిక్షణాసంస్థల్లో జాతీయ అంతరిక్ష దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించాలని విద్యాశాఖ ఆదేశించింది. ఈ మేరకు డీఈవో పి.రమేష్ జిల్లాలో అంతరిక్ష దినోత్సవ నిర్వహణపై పలు సూచనలతో ఉత్తర్వులు జారీచేశారు. అన్ని పాఠశాలల్లో దీన్ని ఘనంగా నిర్వహించాలని, చంద్రయాన్ విజయం పై వర్క్‌షాపులు, ప్రదర్శనలు, ఉపన్యాసాలు జరపాలని ఆదేశించారు. చంద్రయాన్‌పై 13 ప్రాంతీయ భాషల్లో ఉన్న పది ప్రత్యేక పుస్తకాలను ఉపాధ్యాయులు చదివి విద్యార్థులకు వివరించాలన్నారు. వారిని చదివేందుకు ప్రోత్సహించాలన్నారు. ఈ పుస్తకాలు భారత్ ఆన్ ది మూన్ పోర్టల్‌లోను, దీక్ష వేదికలో అందుబాటులో ఉన్నాయన్నారు. భారత్ ఆన్ ది మూన్ పోర్టల్‌లో విద్యార్థులు తమ పేర్లు నమోదు చేసుకునేందుకు, వివిధ కార్యకలాపాల్లో పాల్గొనేందుకు ప్రోత్సహించాలన్నారు. అంతరిక్ష కార్యకలాపాలపై అవగాహన కలిగాక వారికి క్విజ్‌పోటీలు, చంద్రయాన్ నమూనా తయారీ, పెయింటింగ్ తదితర పోటీలు నిర్వహించాలని సూచించారు. జాతీయ అంతరిక్ష దినోత్సవం సందర్భంగా చంద్రయాన్ విజయంపై జాతీయ విద్యాపరిశోధన సంస్థ రూపొందించిన వీడియోను అన్ని పాఠశాల ల్లో ప్రదర్శించాలన్నారు. అంతరిక్ష పరిజ్ఞానం కలిగిన వ్యక్తులను పాఠశాలలకు ఆహ్వానించి వారి అనుభవాలను, విజ్ఞానాన్ని విద్యార్థులకు అందించేలా ప్రధానోపాధ్యాయులు కృషి చేయాలన్నారు.

## విజిలెన్స్ విచారణ అటకెక్కినట్లేనా?



- అన్నవరం దేవస్థానంలో వైసీపీ హయాంలో 18 అంశాలపై విజిలెన్స్‌కు ఫిర్యాదు
- రెండేళ్లుగా ముందుకు కదలని విచారణ

అన్నవరం, ఆగస్టు 22: అన్నవరం దేవస్థానంలో పలు అవినీతి అక్రమాలు జరిగాయంటూ విజిలెన్స్‌కు అప్పటి ట్రస్ట్ బోర్డు సభ్యుడితోపాటు మరొకరు ఫిర్యాదు చేశారు. దీనిపై రెండేళ్లక్రితం విజిలెన్స్ అధికారులు విచారణకు రత్నగిరికి విచ్చేశారు. వైసీపీ ప్రభుత్వంలో 18 అంశాలపై ఫిర్యాదులు అందాయి. వీటిలో నిబంధనలకు వ్యతిరేకంగా నియామకాలు, పదోన్నతుల అంశంతోపాటు గొంది గ్రామంలో దేవస్థానం భూమి ఆక్రమణకు గురైనట్లు, వైసీపీకి చెందిన కాంట్రాక్టర్లకు అనుకూలంగా నిబంధనలు మార్చడం, దేవస్థానం ఈవో క్వార్టర్ నిర్మాణం తదితర అంశాలపై వైసీపీ హయాంలో నియమితులైన పాలకమండలి సభ్యుల్లో ఒకవర్గం మరోవర్గంపై ఫిర్యాదు చేశారు. దీనిపై విజిలెన్స్ ఈఈ, డీఈ, మరో నలుగురి బృందం 2022, డిసెంబరులో విచ్చేసి పలు దస్త్రాలను తమ కార్యాలయానికి తీసుకెళ్లింది. పలువురు దేవస్థానం అధికారులను విచారణకు విజిలెన్స్ కార్యాలయానికి పిలిపించుకుని విచారణ చేశారు. నెలరోజుల వ్యవధిలో రెండుసార్లు రత్నగిరిపై హడావిడి చేయడంతో అక్రమాలు బయటపడతాయని అంతా భావించారు. కానీ అప్పటినుంచి ఎక్కడ వేసిన గొంగలి అక్కడే అన్నచందంగా తయారైంది. దీనిపై విజిలెన్స్ అధికారులను వివరణ కోరగా అన్నవరం దేవస్థానం అవినీతిపై కొంతమేర విచారణ చేపట్టామని, తదుపరి ప్రభుత్వ ఆదేశాలతో మరికొన్ని అంశాలపై విచారణ చేపట్టాలని ఆదేశించడంతో ప్రయారిటీ లిస్ట్‌లో విచారణ జరుగుతోందని బదులిచ్చారు. ఇప్పటికైనా టీడీపీ ప్రభుత్వం స్పందించి విచారణ వేగవంతం అయ్యేలా చేస్తే వైసీపీ నాయకుల బాగోతం వెలుగులోకి వస్తుందనడంలో ఎటువంటి సందేహం లేదు.

## జీజీహెచ్‌లో కార్పొరేషన్ కమిషనర్ పర్యటన

- వైద్యవిద్యార్థినులు, మహిళా వైద్యులు, రోగుల భద్రతకు చర్యలు చేపట్టాలని సూచన



జీజీహెచ్‌లో అందుతున్న వైద్యసేవల గురించి రోగిని అడిగి తెలుసుకుంటున్న కమిషనర్ భావన

జీజీహెచ్(కాకినాడ), ఆగస్టు 22: కాకినాడ జీజీహెచ్‌లోని పలు విభాగాల్లో వార్డులను కాకినాడ నగర పాలక సంస్థ కమిషనర్ భావన గురువారం పర్యటించి అక్కడ మహిళలకు అందుతున్న వైద్యసేవలు, రక్షణ గురించి అడిగి తెలుసుకున్నారు.వైద్యవిద్యార్థినులు, మహిళా రోగులు, మహిళా వైద్యుల భద్రతకు ప్రత్యేక ప్రాధాన్యమిస్తూ రక్షణ చర్యలు చేపట్టాలని వైద్యాధికారులకు సూచించారు. జీజీహెచ్‌లో భద్రతా పరిస్థితులను తెలుసుకునేందుకు ఆమె గురువారం రాత్రి జీజీహెచ్‌లో పర్యటించారు. తల్లి, పిల్లల వార్డులో రోగుల పరిస్థితి ఆమె నేరుగా గర్భిణులను, బాలింతలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం కమిషనర్ పీడియాట్రిక్స్ వార్డులో చికిత్స పొందుతున్న చంటిబిడ్డల తల్లులను పరామర్శించి వారుకు అందుతున్న వైద్యసేవల గురించి అడిగి తెలుసుకున్నారు. తదుపరి కమిషనర్ భావన హౌస్ సర్జన్స్ హాస్టల్‌కు చేరుకుని అక్కడ మహిళా జూనియర్ డాక్టర్లకు అందుతున్న సదుపాయాలను ఆమె పరిశీలించారు. ఆస్పత్రి ప్రాంగణంలో వెలుతురు ఉండేలా చర్యలు చేపట్టాలని ఆస్పత్రి సూపరింటెండెంట్‌కు సూచించారు. సెక్యూరిటీ సిబ్బందిని నిరంతరం అప్రమత్తంగా ఉండేలా ఆదేశించాలని సూచించారు. కమిషనర్ భావన వెంట ఎంహెచ్‌వో డాక్టర్ పృథ్వీచరణ్, ఈఈ మాధవి పాల్గొన్నారు.

## ద్వారంపూడి వీరభద్ర ఎక్స్‌పోర్ట్స్ కంపెనీ వద్ద కార్మికుల ఆందోళన



ప్రత్తిపాడు మండలం లంపకలోవ వీరభద్ర ఎక్స్‌పోర్ట్స్ కంపెనీ మెయిన్‌గేటువద్ద బైఠాయించి ఆందోళన చేస్తున్న కార్మికులు

- సమస్యలు పరిష్కరించాలని డిమాండ్

ప్రత్తిపాడు, ఆగస్టు 22: ప్రత్తిపాడు మండలం లంపకలోవ గ్రామ సమీపంలోని ద్వారంపూడి కుటుంబానికి చెందిన వీరభద్రరావు ఎక్స్‌పోర్ట్స్ కంపెనీ వద్ద గురువారం ఆ కంపెనీ కార్మికులు భారీఎత్తున తరలివచ్చి ఆందోళన నిర్వహించారు. ఈ కంపెనీలో పనిచేస్తున్న వందలాదిమంది కార్మికులు కంపెనీ ప్రధాన ద్వారం ఎదుట టెంట్లు వేసి బైఠాయించి నినాదాలు చేశారు. లంపకలోవ పరిసర గ్రామాలకు చెందిన సర్పంచ్‌లు, నేతలు వీరి ఆందోళనకు సంఘీభావం తెలిపారు. తమకు హక్కులు కల్పించాలని, 1926-కార్మికుల చట్టం ప్రకారం వీరభద్ర ఎక్స్‌పోర్ట్స్ తమకు గౌరవం కల్పించాలని కార్మికులు డిమాండ్ చేశారు. పీఎఫ్, ఈఎస్ఐ ఇచ్చి ఉద్యోగ భద్రత కల్పించాలన్నారు. కనీస వేతన చట్టంప్రకారం వేతనం ఇవ్వాలని, ప్రతి కార్మికుడికి ఆరోగ్య భద్రత కల్పించాలని అన్నారు. ఒకరోజు అదనంగా సెలవు తీసుకుంటే రెండురోజుల జీతం కట్ చేస్తున్నారని, తమపట్ల కనీస మర్యాద లేకుండా దుర్భాషలాడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. తమతో వెట్టిచాకిరీ చేయిస్తున్నారని, ప్రారంభ జీతం రూ.12వేలు చెల్లించాల్సి ఉండగా రూ.9వేలే చెల్లిస్తున్నారని కేటగిరీలవారీగా జీతాలు పెంచాలని డిమాండ్ చేశారు. వెంటనే యాజమాన్యం తమ సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని కోరారు. ఆందోళనకు లంపకలోవ సర్పంచ్ పి.మణికుమారి దొరబాబు, ఉత్తరకంచి సర్పంచ్ మంతెన వెంకటరమణ(శ్రీను) మద్దతు తెలిపారు.



## కాకినాడలో కమిటీ కుర్రోళ్లు

పోర్టుసిటీ(కాకినాడ), ఆగస్టు 22: కమిటీ కుర్రోళ్లు చిత్ర యూనిట్ కాకినాడలో గురువారం రాత్రి సందడి చేసింది. విజయయాత్రలోభాగంగా భానుగుడిలోని ఆనంద్ థియేటర్‌కు విచ్చేశారు. నిర్మాత కొణిదెల నిహారిక, దర్శకులు యదు సూర్య, మేనేజర్ రమేష్ పాల్గొన్నారు.

## నేడు నూతన జేసీ బాధ్యతల స్వీకరణ

కలెక్టరేట్(కాకినాడ), ఆగస్టు 22: జిల్లా జేసీగా రాహుల్ మీనా శుక్రవారం బాధ్యతలు స్వీకరించనున్నట్టు కలెక్టరేట్ అధికారులు వెల్లడించారు. ఆయన ప్రకాశం జిల్లా మార్కాపురం సబ్‌కలెక్టర్‌గా పనిచేస్తూ బదిలీపై వస్తున్నారు.



పెళ్లి బృందాలతో సందడిగా ఉన్న రత్నగిరి ప్రాంగణం

## రత్నగిరిపై పెళ్లి సందడి

**సత్యదేవుని సాక్షిగా ఒక్కటైన 200 జంటలు**

అన్నవరం, ఆగస్టు 22: ప్రముఖ పుణ్యక్షేత్రమైన రత్నగిరి గురువారం బాజాభజంత్రీలతో మార్మోగింది. పెళ్లి బృందాలతో కిటకిటలాడింది. రామాలయం ప్రాంగణమంతా మండపాల డెకరేషన్‌తో ప్రత్యేక శోభ సంతరించుకుంది. రాత్రి 11 గంటలు, వేకువజామున 3 గంటల ముహూర్తాల్లో సత్యదేవుని సాక్షిగా సుమారు 200 జంటలు ఒక్కటయ్యాయి. పెళ్లి బృందాలకు గదుల కేటాయింపు తలకు మించిన భారం కావడంతో ఈవో ముగ్గురు సూపరింటెండెం ట్లతో కమిటీ వేశారు. ఒక్కో వివాహ బృందానికి కనీసం రెండు గదులను అందించడంతో ఊపిరి పీల్చుకున్నారు. సామాన్యులకు మాత్రం ఇక్కట్లు తప్పలేదు. పెళ్లి బృందాల వాహనాలు హరిహరసదన్, విష్ణుసదన్ కాటేజీల వద్ద రోడ్డుపై భారీగా నిలిచిపోగా సెక్యూరిటీ సిబ్బంది క్రమబద్ధీకరించారు. రద్దీ కారణంగా స్వామివారి వ్రతాలు, సర్వదర్శనాలను శుక్రవారం ఉదయం ఐదు గంటలకు ప్రారంభించాలని నిర్ణయించారు.

## వాడపల్లి వెంకన్న హుండీల ఆదాయం రూ.70.16 లక్షలు



ఆత్రేయపురం, ఆగస్టు 22: కోనసీమ తిరుమల వాడపల్లి శ్రీవేంకటేశ్వర స్వామి ఆలయంలోని హుండీలను దేవదాయ శాఖ పర్యవేక్షణాధికారులు ఎం.లక్ష్మీనారాయణ, పీవీవీఎస్ కామేశ్వరరావు పర్యవేక్షణలో గురువారం తెరిచి లెక్కించారు. ఆలయంలో 19 హుండీలు ఉండగా భారీ వర్షం కారణంగా 13 హుండీలనే లెక్కించారు. వీటి ద్వారా 39 రోజులకు ప్రధాన హుండీల ద్వారా రూ.70,16,714 ఆదాయం వచ్చింది. బంగారం 72 గ్రాములు, వెండి 750 గ్రాములు, పలు దేశాల విదేశీ కరెన్సీ లభించినట్టు ఉప కమిషనరు, ఈవో భూపతిరాజు కిషోర్‌కుమార్ తెలిపారు. లెక్కింపులో ఆలయ సిబ్బంది, గ్రామస్తులు, బ్యాంకు సిబ్బంది, పోలీసులు పాల్గొన్నారు.




ధనస్సు, బాణాన్ని దర్శించుకుంటున్న భక్తులు

## బాలరాముడి ధనుర్బాణాలివిగో...

పెద్దాపురం, ఆగస్టు 22: అయోధ్య రామ మందిరంలో బాల రాముడి విగ్రహానికి సమర్పించనున్న ధనుర్బాణాలను కాకినాడ జిల్లా పెద్దాపురంలోని కన్యకాపరమేశ్వరి ఆలయంలో గురువారం భక్తుల సందర్శనార్థం ప్రదర్శించారు. హైదరాబాద్‌కు చెందిన చల్లా శ్రీనివాసశాస్త్రి అనే భక్తుడు 13 కిలోల వెండి, కిలో బంగారంతో ధనుస్సు, బాణం తయారు చేయించాడు. రామ మందిరం పూర్తికావడానికి ఇంకా సమయం ఉండడంతో వీటిని ప్రముఖ ఆలయాల్లో భక్తుల దర్శనార్థం తీసుకెళ్తున్నారు. కన్యకాపరమేశ్వరి ఆలయానికి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి ధనుర్బాణాలను దర్శించి తరించారు. మంగళహారతులు ఇచ్చి ప్రత్యేక పూజలు చేశారు.

## కోనసీమలో నేడు సీఎం పర్యటన



అమలాపురం, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు శుక్రవారం ఉదయం 11 గంటలకు ఉండవల్లి నుంచి హెలికాప్టర్‌లో బయల్దేరతారు.

- 11.40 గంటలకు డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా అయినవిల్లిలో ఏర్పాటుచేసిన హెలిపాడ్ వద్దకు చేరుకుంటారు. ప్రజాప్రతినిధులు, అధికారులు ఆయన్ను కలుసుకుంటారు.
- 11.45 గంటలకు హెలిపాడ్ వద్ద బయల్దేరి రోడ్డు మార్గంలో 11.50 గంటలకు వానపల్లి పంచాయతీ కార్యాలయం వద్ద ఏర్పాటుచేసిన ప్రజా వేదిక వద్దకు చేరుకుంటారు.
- మధ్యాహ్నం 1.30 గంటల వరకు అక్కడ జరిగే స్వర్ణ గ్రామ పంచాయతీ గ్రామసభలో పాల్గొంటారు. ప్రజలతో ముఖాముఖి నిర్వహిస్తారు. అనంతరం ప్రజలనుద్దేశించి మాట్లాడతారు.
- రెండు గంటల నుంచి పది నిమిషాల పాటు స్థానిక నాయకులతో ముఖాముఖి మాట్లాడతారు.
- 2.10 గంటలకు వానపల్లి పంచాయతీ కార్యాలయం వద్ద బయల్దేరి రోడ్డు మార్గంలో బయలుదేరి హెలిపాడ్ వద్దకు చేరుకుంటారు.
- 2.20 గంటలకు హెలిపాడ్ నుంచి బయల్దేరి 2.35 గంటలకు రాజమహేంద్రవరం ఎయిర్‌పోర్టుకు చేరుకుంటారు.
- 2.45 గంటలకు ఎయిర్‌పోర్టు నుంచి బయల్దేరి 3.35 గంటలకు బేగంపేట ఎయిర్‌పోర్టుకు చేరుకుంటారు.
- 3.40 గంటలకు ఎయిర్‌పోర్టు నుంచి బయలుదేరి నాలుగు గంటలకు హైదరాబాద్ జూబ్లీహిల్స్‌లోని ఇంటికి చేరుకుంటారు.



అయినవిల్లిలో హెలిపాడ్‌కు ఏర్పాట్లు చేస్తున్న దృశ్యం



హారిక మృతదేహం వద్ద రోదిస్తున్న తల్లి, కుటుంబీకులు

## లేమ్మా... హారికా

### మమ్మల్ని విడిచి వెళ్లిపోయావా

### కన్నీరుమున్నీరైన కుటుంబ సభ్యులు



సర్పవరం జంక్షన్, ఆగస్టు 22: వాళ్లది నిరుపేద కుటుంబం... తండ్రి తాపీమేస్త్రీ కాగా తల్లి ఓ చిన్న కిళ్లీ కొట్టు నిర్వహిస్తోంది. ఇద్దరు పిల్లలు. చీకూచింతా లేకుండా ఆనందంగా సాగిపోతున్న ఆ కుటుంబాన్ని కష్టాలు వెన్నాడాయి. చిన్నప్పుడు కుమారుడు, నాలుగేళ్ల కిందట కొవిడ్‌తో భర్త, ఉద్యోగం సాధించి ఇప్పుడిప్పుడే చేతికి అందివస్తున్న క్రమంలో కుమార్తెను కోల్పోయిన ఆ తల్లి మనోవేదన వర్ణనాతీతం. అమ్మా సెలవు లేదు... మరలా వస్తానని చెప్పి ఇంటినుంచి వెళ్లిన సాయంత్రమే రియాక్టర్ పేలుడు దుర్ఘటనలో కుమార్తె హారిక తీవ్రంగా గాయపడి మృతి చెందిందన్న సమాచారం తెలిసిన వెంటనే ఆ మాతృమూర్తి కన్నీరుమున్నీరుగా విలపించింది. గురువారం ఉదయం ఇంటికి చేరుకున్న కుమార్తె మృతదేహంపై పడి గుండెలు బాదుకుంటూ విలపించిన తీరు చూపరులను కంటతడి పెట్టించింది.

కాకినాడ రెండో డివిజన్ సౌజన్య నగర్‌కు చెందిన చల్లపల్లి ఈశ్వరరావు-అన్నపూర్ణ దంపతులకు ఒక కుమారుడు, కుమార్తె చల్లపల్లి హారిక (22) ఉన్నారు. ఈశ్వరరావు తాపీమేస్త్రీగా కుటుంబాన్ని పోషించాడు. కుమారుడు చిన్నప్పుడే ఇల్లు వదిలి వెళ్లిపోయాడు. ఈశ్వరరావు కొవిడ్‌తో మృతి చెందాడు. అన్నపూర్ణ కిళ్లీకొట్టు ద్వారా వచ్చిన సంపాదనతో కుమార్తెను మున్సిపల్ హైస్కూల్లో చదివించింది. పదో తరగతిలో పదికి పది పాయింట్లు సాధించి మెరిట్ జాబితాలో ఇడుపులపాయ ట్రిపుల్ ఐటీలో కెమికల్ ఇంజనీరింగ్ కోర్సు పూర్తి చేసింది. అనకాపల్లి జిల్లా అచ్యుతాపురంలోని ఒక ఫార్మా కంపెనీలో 2023 సెప్టెంబరులో కెమికల్ ఇంజనీర్‌గా ఉద్యోగంలో చేరింది. సోమవారం రాఖీ పండుగ కోసం రెండు రోజులు సెలవు పెట్టి కాకినాడలోని ఇంటికి వచ్చింది. రాఖీ పౌర్ణమి రోజున సంతోషంగా సోదరులకు రాఖీ కట్టి ఆప్యాయతను పంచుకుంది. మరో రెండు రోజులు ఉండాలని తల్లి, కుటుంబ సభ్యులు కోరినా సెలవు లేకపోవడంతో బుధవారం ఉదయం బయల్దేరి వెళ్లి ఉద్యోగంలో చేరింది. బుధవారం సాయంత్రం కంపెనీలో జరిగిన రియాక్టర్ పేలుడు ఘటనలో విధి నిర్వహణలో ఉన్న హారిక తీవ్ర గాయాలతో మృతి చెందింది.

హారిక మృతి చెందిందన్న వార్త తెలిసిన వెంటనే కాకినాడ జిల్లా కలెక్టర్ షాన్ మోహన్ మృతదేహాన్ని దగ్గరుండి తీసుకురావాలని కాకినాడ అర్బన్ తహసీల్దారు జితేంద్రను ఆదేశించారు. ఆయన ఆర్ఐ బి.రాజు, వీఆర్వో తాతారావుతో కలిసి బుధవారం రాత్రి విశాఖపట్నం వెళ్లి మహాప్రస్థానం వాహనంలో గురువారం ఉదయం మృతదేహాన్ని తీసుకువచ్చి కుటుంబ సభ్యులకు అప్పగించారు. హారిక మృతదేహాన్ని చూసిన తల్లి అన్నపూర్ణ, మావయ్య, అత్తలు, పెదనాన్న, పెద్దమ్మ, సోదరులు, కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరుగా విలపించారు. రెండు రోజులు ఉండమన్నా ఉండకుండా అనంత లోకాలకు వెళ్లిపోయావా తల్లీ అంటూ వారి రోదించారు. కుటుంబీకుల సమక్షంలో దహన సంస్కారాలు నిర్వహించారు. హారిక కుటుంబానికి రూ.కోటి పరిహారం చెక్కు తీసుకునేందుకు తహసీల్దారు అనకాపల్లి వెళ్లారు.

## అసిస్టెంట్ మేనేజరు నాగబాబు మృతి

### సామర్లకోటలో విషాదఛాయలు



భార్య, కుమార్తెలతో నాగబాబు (పాత చిత్రం)

సామర్లకోట, ఆగస్టు 22: అచ్యుతాపురంలోని ఫార్మా కంపెనీలో జరిగిన విస్ఫోటనంలో కాకినాడ జిల్లా సామర్లకోట గాంధీనగర్‌కు చెందిన మొండి నాగబాబు దుర్మరణం చెందాడు. ఉన్నత విద్య అనంతరం ఫార్మా కంపెనీలో అసిస్టెంట్ మేనేజరుగా ఉద్యోగంలో చేరిన నాగబాబు భార్య సాయి, కుమార్తె సాన్విత (9), కుమారుడు మాన్వింత్(6)లతో కలిసి విశాఖపట్నంలో నివాసముంటున్నాడు. రోజూలాగే బుధవారం కూడా ఉద్యోగానికి వెళ్లిన భర్త ప్రమాదంలో చిక్కుకుని తిరిగిరాని లోకాలకు వెళ్లాడన్న సమాచారం తెలిసి భార్య నిశ్చేష్టురాలైంది. నాగబాబు తల్లి లక్ష్మి, ఇద్దరు సోదరులు తీవ్ర దిగ్భ్రాంతికి లోనయ్యారు. వారంతా బుధవారం రాత్రి హుటాహుటిన విశాఖకు పయనమయ్యారు. మృతదేహాన్ని గురువారం రాత్రి సామర్లకోట తీసుకొచ్చారు. నాగబాబు కుటుంబానికి రూ.కోటి పరిహారం చెక్కు తీసుకునేందుకు తహసీల్దారు అనకాపల్లి వెళ్లారు.

## తిరిగిరాని లోకాలకు గణేష్‌కుమార్

### మగ దిక్కు కోల్పోయామంటూ కుటుంబీకుల కంటతడి



గణేష్‌కుమార్ (పాత చిత్రం)

బిక్కవోలు, ఆగస్టు 22: అచ్యుతాపురం ఫార్మా సెజ్‌లోని ఎసెన్షియా పరిశ్రమలో జరిగిన ప్రమాదంలో తూర్పు గోదావరి జిల్లా బిక్కవోలు మండలం జువ్వలదొడ్డికి చెందిన కొప్పర్తి గణేష్‌కుమార్ (33) మృతి చెందాడు. గణేష్ తండ్రి సత్యనారాయణకు భవాని టైలర్‌గా గ్రామంలో మంచి పేరుంది. ఈయన ఐదేళ్ల క్రితం మృతి చెందాడు. అప్పటి నుంచి గణేష్ ఇంటి బాధ్యతలు చేపట్టాడు. డిగ్రీ చదివిన గణేష్‌కు రెండేళ్ల క్రితం వివాహమైంది. ఓ కుమారుడు కూడా వున్నాడు. తల్లి, చెల్లి, భార్య, కుమారుడికి గణేషే ఆధారం. హైదరాబాద్‌లోని దివీస్ కంపెనీలో పనిచేసిన అతడు మూడేళ్ల క్రితం అచ్యుతాపురంలోని కంపెనీలో ప్రొడక్షన్ విభాగంలో సీనియర్ ఎగ్జిక్యూటివ్‌గా విధుల్లో చేరాడు. మగదిక్కు కోల్పోయామంటూ గణేష్ తల్లి, చెల్లి, భార్య విలపిస్తున్న తీరు స్థానికులను కంటతడి పెట్టించింది. ప్రభుత్వం తమ కుటుంబాన్ని ఆదుకోవాలన్నారు.



సెమినార్ ప్రారంభ సభలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు

## భవిష్యత్తు అంతా స్మార్ట్ మెటీరియల్‌దే

### అంతర్జాతీయ సైన్స్ సెమినార్‌లో శాస్త్రవేత్తల ఉద్ఘాటన

మండపేట, ఆగస్టు 22: మండపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో అంతర్జాతీయ స్థాయి సైన్స్ సెమినార్ నిర్వహించడం అభినందనీయమని ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు అన్నారు. దేశ, విదేశాల నుంచి వచ్చిన శాస్త్రవేత్తలు వారి విలువైన సందేశాలను అందించడం హర్షణీయమన్నారు. సెమినార్ నిర్వహణకు కళాశాల అధ్యాపకులు చేసిన కృషిని వేగుళ్ల కొనియాడారు. 'స్మార్ట్ మెటీరియల్, అడ్వాన్స్‌డ్ అప్లికేషన్స్' అంశంపై రెండు రోజుల పాటు జరిగే అంతర్జాతీయ సెమినార్‌ను మండపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఎమ్మెల్యే వేగుళ్ల జ్యోతిప్రకాశనంతో ప్రారంభించారు. సెమినార్‌కు కళాశాల ప్రిన్సిపాల్ శ్రీనివాసరావు అధ్యక్షత వహించారు. మారుతున్న కాలంతో పాటు సమాజంలో స్మార్ట్ మెటీరియల్ అవశ్యకతను దక్షిణ కొరియా నుంచి వచ్చిన శాస్త్రవేత్తలు ఎన్.నవీన్‌కుమార్, డాక్టర్ ఎన్.భార్గవ్ వివరించారు. తిరుచానపల్లి ఐఐటీ నుంచి వచ్చిన ప్రొఫెసర్ హేమలత నానో టెక్నాలజీ గురించి వివరించారు. డాక్టర్ బిపిన్‌కుమార్ (న్యూఢిల్లీ), డాక్టర్ పి.విష్ణుప్రశాంత్ (తిరుపతి) స్మార్ట్ మెటీరియల్‌పై విద్యార్థులకు వివరించారు. భవిష్యత్తు అవసరాలను దృష్టిలో ఉంచుకుని స్మార్ట్ మెటీరియల్ ప్రాధాన్యాన్ని గుర్తించాలని సూచించారు. దేశ, విదేశాల నుంచి వచ్చిన శాస్త్రవేత్తలు వందకు పైగా వ్యాసాలను సదస్సులో ప్రదర్శించారు. విద్యార్థులు శాస్త్రవేత్తల సందేశాలను విని వారి సందేహాలను నివృత్తి చేసుకున్నారు. మారుమూల పట్టణమైన మండపేటలో ఈ తరహా అంతర్జాతీయ సెమినార్ నిర్వహించడం, అందులో పాల్గొనడం తమకెంతో ఆనందంగా వుందని శాస్త్రవేత్తలు చెప్పారు. కళాశాల అధ్యాపకులు డాక్టర్ కె.శ్రీనివాసరావు, ఎన్ఎస్‌వీ కిరణ్‌కుమార్, ఎ.ఆనందరావు, వివిధ కళాశాలలకు చెందిన విద్యార్థులు పాల్గొన్నారు.

## రాజీ మార్గమే రాజ మార్గం

### వచ్చే నెల 14న జాతీయ లోక్ అదాలత్



**ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా ప్రధాన న్యాయమూర్తి గంధం సునీత**

రాజమహేంద్రవరం, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): రాజీ మార్గమే రాజమార్గంగా స్నేహభావంతో లోక్ అదాలత్‌లో కేసులను పరిష్కరించుకుంటే సమయం, ఖర్చు ఆదా అవుతాయని ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా ప్రధాన న్యాయమూర్తి, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ చైర్‌పర్సన్ గంధం సునీత పేర్కొన్నారు. రాజమహేంద్రవరంలోని తన చాంబర్‌లో గురువారం ఏర్పాటుచేసిన మీడియా సమావేశంలో ఆమె మాట్లాడారు. సెప్టెంబరు 14న నిర్వహించే జాతీయ లోక్ అదాలత్‌లో రాజీ ద్వారా కేసులు పరిష్కరించుకునే అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఉమ్మడి జిల్లాలోని రెండు మండల లీగల్ సర్వీసెస్ అథారిటీల్లో దాదాపుగా 40 ప్రత్యేక బెంచ్‌లు ఏర్పాటు చేస్తున్నామన్నారు. న్యాయవాదిని నియమించుకునే పరిస్థితి లేనివారు నేరుగా కోర్టు అవరణలో ఉండే న్యాయ సేవాధికార సంస్థను సంప్రదిస్తే సహాయం చేస్తారన్నారు. ఎలాంటి ఖర్చు ఉండదని చెప్పారు. కేసు పరిష్కారమైన తర్వాత ఇరుపక్షాలనూ విజేతలుగానే భావిస్తారు. లోక్ అదాలత్ అవార్డు (తీర్పు)పై ప్రత్యేక పరిస్థితుల్లో తప్ప అప్పీల్ చేసుకునే అవకాశం కూడా లేదన్నారు. ఒకవేళ ఒప్పుకున్న పరిహారం ఇవ్వడంలో ఇబ్బందిపెడితే నేరుగా ఇక్కడే పిటిషన్ వేసుకునే వెసులుబాటు ఉందన్నారు. లోక్ అదాలత్‌ల ద్వారా పరిష్కారమైన కేసుల్లో కక్షిదారులకు ఇప్పటిదాకా సుమారు రూ.100కోట్ల పరిహారం అందజేసినట్టు చెప్పారు.

## సూత్రధారులెవరో!

- ఇసుక దొంగతనం వ్యవహారంలో ముందుకు కదలని విచారణ
- చర్యలకు ఏవేవో కారణాలు చెప్తున్న రెవెన్యూ అధికారులు



ఇసుక లోడ్ చేసిన లారీని జామాయిల్ తోటలో దాచిన దృశ్యం (పాత చిత్రం)

ఎటపాక, ఆగస్టు 21: వారం క్రితం గుండాల ఇసుక డంప్-2 వద్ద ఇసుకను దొంగతనంగా లారీలో లోడ్ చేసుకుని రవాణా చేస్తూ పట్టుబడిన తెలంగాణకు చెందిన ఇసుక లారీ వెనుక సూత్రధారులు ఎవరనేది రెవెన్యూ అధికారులు ఇంకా తేల్చలేదు. ప్రభుత్వ ఇసుకను దొంగతనం చేసి వారం కావస్తున్నా ఎలాంటి చర్యలూ తీసుకోకపోవడంపై అనేక విమర్శలు వస్తున్నాయి. అయితే ఇసుక దొంగతనం వ్యవహారాన్ని దగ్గరుండి నడిపించింది రెవెన్యూ శాఖలోని ఇంటి దొంగల పనేనా... లేక రాజకీయ పార్టీల నాయకుల ప్రోద్బలంతో కొందరు తెర వెనుక ఉండి నడిపించినట్టుగా అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. వారం కిందట గుండాల ఇసుక డంప్-2 నుంచి దొంతనంగా లోడ్ చేసుకుని లారీని ఒడిసా వైపు తరలిస్తుండగా నెల్లిపాక వద్ద కొందరు పట్టుకుని రెవెన్యూ అధికారులకు అప్పగించిన విషయం విదితమే. ఆ రోజున ఇసుక డంప్-2లో లారీలో ఇసుక లోడ్ చేస్తుండగా ఓ విలేకరి వీడియో తీశాడు. స్థానిక రెవెన్యూ సిబ్బంది ఒకరు ఈ వ్యవహారంలో భాగస్వామి అయి తానే దగ్గరుండి నడిస్తున్నట్టుగా ఇసుక లారీని ఎందుకు వీడియో తీస్తున్నావు అంటున్న వీడియో ప్రస్తుతం సామాజిక మాధ్యమాల్లో వైరల్ అవుతోంది. కాగా ఇసుక లోడింగ్‌కు లోడ్‌కు వినియోగించిన ఎక్స్‌కవేటర్ దొరికినప్పటికీ ఎలాంటి చర్యలు తీసుకోకుండా కేవలం లారీని మాత్రమే పట్టుకుని పోలీస్ స్టేషన్‌కు తరలించడంపై అనేక ఆక్షేపణలు వ్యక్తమవుతున్నాయి. జిల్లా ఉన్నతాధికారులు స్పందించి క్షేత్రస్థాయిలో విచారణ జరిపితే నిజాలు నిగ్గుతేలే అవకాశం ఉంది. ఈ విషయమై డిప్యూటీ తహసీల్దారు పృధ్వీని వివరణ కోరగా... ఆ సమయంలో తాను విధుల్లో లేనన్నారు. లారీని తనకు అప్పగించిన తహసీల్దారు బదిలీ అయ్యారని, విచారణ చేపట్టి బాధ్యులపై చర్యలు తీసుకుంటామని చెప్పారు.

## చదువుకోమని మందలించారని విద్యార్థిని బలవన్మరణం



సుష్మశ్రీదేవి (పాత చిత్రం)

కరప, ఆగస్టు 22: చదువుకోమని మందలించిన పాపానికి ఆ విద్యార్థిని బలవన్మరణానికి పాల్పడి కుటుంబ సభ్యులకు పుట్టెడు శోకాన్ని మిగిల్చింది. ఆలస్యంగా వెలుగుచూసిన ఈ ఘటనకు సంబంధించి కరప పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. కాకినాడ జిల్లా కరప మండలం నడకుదురుకు చెందిన పడాల సుష్మ శ్రీదేవి (19) కోరంగి కేజీపీటీ కళాశాలలో ఫార్మ్-డి చదువుతోంది. చదువులో వెనుకబడుతోందనే ఉద్దేశంతో తల్లి ఆదిలక్ష్మి కుమార్తెను మందలించి బాగా చదువుకోవాలని చెప్పేది. దీంతో మనస్థాపం చెందిన సుష్మ శ్రీదేవి తల్లిని బెదిరిద్దామని ఈ నెల 20వ తేదీ ఉదయం గడ్డిమందు తాగి అపస్మారక స్థితికి చేరుకుంది. గమనించిన కుటుంబసభ్యులు వెంటనే కాకినాడలోని ఒక ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. మెరుగైన వైద్యం నిమిత్తం అక్కడి నుంచి వేరొక ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ బుధవారం రాత్రి మృతిచెందింది. ఒక్కగానొక్క కూతురు తమను అర్ధంతరంగా వదిలి వెళ్లిపోవడంతో ఆమె తల్లిదండ్రులు, కుటుంబసభ్యులు కన్నీరుమున్నీరయ్యారు. మృతదేహానికి కాకినాడ జీజీహెచ్‌లో పోస్టుమార్టం నిర్వహించి కుటుంబ సభ్యులకు అప్పగించారు. మృతురాలి తల్లి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్టు ఎస్ఐ తూపాటి రామకృష్ణ తెలిపారు.

## రైలు ఢీకొని వ్యక్తి మృతి



తుని రూరల్, ఆగస్టు 22: తుని, హంసవరం స్టేషన్ల మధ్యలో రైలు ఢీకొనడంతో సుమారు 30 ఏళ్ల వ్యక్తి మృతి చెందాడు. సంఘటనా స్థలాన్ని తుని రైల్వే పోలీసులు పరిశీలించి మృతుడి వివరాల కోసం అన్వేషించగా ఎటువంటి గుర్తులు లేవు. నీలం రంగు టీషర్ట్, నీలం రంగు జీన్స్ ప్యాంట్ ధరించి ఉన్నాడు. సంబంధీకులు ఎవరైనా ఉంటే తుని రైల్వే పోలీసులను సంప్రదించాలని రైల్వే ఎస్ఐ జి.శ్రీనివాసరావు కోరారు.

## ద్విచక్ర వాహనాన్ని ఢీకొట్టిన లారీ: వ్యక్తి మృతి



మృతుడు మణికంఠ (పాత చిత్రం)

తాళ్లరేవు, ఆగస్టు 22: కాకినాడ జిల్లా తాళ్లరేవు మండలం పటవల పంచాయతీ రాఘవేంద్రపురం 216 జాతీయ రహదారిపై గురువారం జరిగిన ప్రమాదంలో వ్యక్తి మృతి చెందినట్టు కోరింగ ఎస్ఐ పి.సత్యనారాయణ తెలిపారు. వివరాలు ఇలా వున్నాయి... కాజులూరు మండలం జగన్నాథగిరికి చెందిన జగ్గపు మణికంఠ (30) మట్లపాలెం మహాలక్ష్మి అమ్మవారి ఆలయానికి ద్విచక్ర వాహనంపై వెళ్లాడు. చేతికి కడియం వేసుకుని తిరిగి ఇంటికి వెళ్తున్న సమయంలో రాఘవేంద్రపురం వద్ద 216 జాతీయ రహదారిపై ఎదురుగా యానాం నుంచి వస్తున్న లోడు లారీ ఢీకొట్టింది. మణికంఠకు బలమైన గాయం కావడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం పోలీసులు కాకినాడ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ సత్యనారాయణ తెలిపారు.

## హార్లిక్స్ ట్రేడ్ యూనియన్ ఎన్నికల్లో ఐక్య కూటమిదే విజయం

ధవళేశ్వరం, ఆగస్టు 22: హార్లిక్స్ ట్రేడ్ యూనియన్ ఎన్నికల్లో ఐదు యూనియన్లు ఐక్య కూటమిగా పోటీ చేసి విజయం సాధించారు. గురువారం నిర్వహించిన ఎన్నికల్లో 965 ఓట్లు పోలయ్యాయి. ఐఎన్టీయూసీ, టీఎస్టీయూసీ, గోదావరి జీఎస్‌కే, జీఎస్‌కే హార్లిక్స్ వర్కర్స్ యూనియన్, చైతన్య ఎంప్లాయిస్ యూనియన్ ఐక్యంగా పోటీ చేసి 729 ఓట్లు పొంది ఘన విజయం సాధించాయి. సీఐటీయూ అనుబంధ ఎస్‌టీసీటీ ఎంప్లాయిస్-వర్కర్స్ యూనియన్‌కి 234 ఓట్లు మాత్రమే వచ్చాయి. రెండు ఓట్లు చెల్లవివిగా నమోదయ్యాయి.

## డాక్టర్ రామారెడ్డికి యోగా థెరపీలో పీహెచ్‌డీ పట్టా




రాజమహేంద్రవరం కల్చరల్, ఆగస్టు 22: పుదుచ్చేరిలో గురువారం జరిగిన శ్రీబాలాజీ విద్యాపీఠ్ డీమ్డ్ యూనివర్సిటీ స్నాతకోత్సవంలో డాక్టర్ కర్రి రామారెడ్డికి యోగా థెరపీలో పీహెచ్‌డీని చాన్సలర్ రాజగోపాలన్ ప్రదానం చేశారు. యోగా థెరపీలో పీహెచ్‌డీ దేశంలోనే ఇదే మొదటిది. ఈ సందర్భంగా ఇనిస్టిట్యూట్ ఆఫ్ శాల్యుటో జెనిసిస్ అండ్ కాంప్లిమెంటరీ మెడిసిన్ ఐఎస్‌సీఎం డైరెక్టర్, యోగాచార్య ప్రొఫెసర్ ఆనంద్ బాలయోగి భవనాని.. డాక్టర్ రామారెడ్డికి పెరల్ ఆఫ్ ఐఎస్‌సీఎం (ఇనిస్టిట్యూట్ ఆణిముత్యం) అవార్డు అందజేశారు.

## మండపేటలో 'కమిటీ కుర్రాళ్లు'

### సప్తగిరి థియేటర్లో చిత్ర బృందం సందడి

మండపేట, ఆగస్టు 22: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా మండపేటలో 'కమిటీ కుర్రాళ్లు' చిత్ర బృందం గురువారం సందడి చేసింది. సినిమా హిట్ కావడంతో ఆ ఆనందాన్ని ప్రేక్షకులతో పంచుకోవడానికి యూనిట్ సభ్యులు సప్తగిరి థియేటర్‌కు వచ్చారు. నిర్మాత కొణిదల నిహారిక, నటులు ప్రేక్షకులతో ముచ్చటించారు. డైరెక్టర్ యదువంశీ షూటింగ్‌కు సంబంధించిన విషయాలను పంచుకున్నారు. సప్తగిరి థియేటర్ యాజమాన్యం మల్లిపూడి గణేష్, ముత్యాల రామకృష్ణ తదితరులు చిత్ర యూనిట్ సభ్యులను సత్కరించారు. కార్యక్రమంలో థియేటర్ మేనేజరు సుందరం, మల్లేశ్వరరావు, మెగా ఫ్యామిలీ యువత అధ్యక్షుడు కొంత నాగేంద్రప్రసాద్, మోరం బాలాజీ, శెట్టి రవి తదితరులు పాల్గొన్నారు.



కేక్ కట్ చేస్తున్న నిర్మాత నిహారిక

# కాకినాడ

• కాకినాడ సిటీ • రూరల్ • పిఠాపురం • పెద్దాపురం • తుని • ప్రత్తిపాడు • జగ్గంపేట

## నేడు సామూహిక వరలక్ష్మీ వ్రత పూజలు

సామర్లకోట, ఆగస్టు 22: శ్రావణమాసం మూడో శుక్రవారం సందర్భంగా మహిళలతో సామూహిక వరలక్ష్మీ వ్రత పూజలు నిర్వహించనున్నట్టు సామర్లకోట కుమార రామ భీమేశ్వరాలయ ఈవో బళ్ళ నీలకంఠం తెలిపారు. దాతల సౌజన్యంతో పూజా సామగ్రి, ప్రసాదాలను వ్రత పూజలల్లో ఆశీనులైన భక్తులకు మాత్రమే గాక వెంట వచ్చిన ఒక్కరికి నిత్యాన్నదాన భోజన పథకంలో అన్నప్రసాదాలను అందించే ఏర్పాట్లు చేశామన్నారు.

## నేడు పలుచోట్ల విద్యుత్ సరఫరాకు అంతరాయం

పిఠాపురం, ఆగస్టు 22: పిఠాపురంలో శుక్రవారం విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఏపీఈపీడీసీఎల్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ఏపీఎస్‌డీఎస్ ప్రభాకర్ తెలిపారు. పట్టణంలోని విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో గల ఫీడర్లపై మరమ్మతులు నిర్వహించేందుకు ఉదయం 9నుంచి 11గంటల వరకూ పిఠాపురం పట్టణం, పి.రాయవరం, తిమ్మాపురం, కోలంక, గోకివాడ, జములపల్లి, మాధవపురం, ఇల్లింద్రాడ, నరసింగపురం గ్రామాల్లో విద్యుత్ సరఫరా నిలిచిపోతుందని, గమనించాలని కోరారు.

**కొత్తపల్లి:** కొత్తపల్లి విద్యుత్‌సబ్‌స్టేషన్ పరిధిలో కోనపాపపేట- కొమరగిరి లైన్‌కు వార్షిక మరమ్మతుల నిమిత్తం శుక్రవారం విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్ప డుతుందని పెద్దాపురం డివిజన్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ఏ.ప్రభాకరరావు తెలిపారు. ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 1గంట వరకు కోనపాపపేట, శ్రీరాంపురం, రావివారిపోడు, ముమ్మిడివారిపోడు, రామరాఘవపురం, మల్లివారితోట, శ్రీరాంపురం చెరువులు, రమణక్కపేట చెరువులు, హేచరీలు, కొమరగిరి పరిధిలో జగనన్న మెగా లేఅవుట్, గోర్స, వెంకటరాయపురం, చినకలవలదొడ్డి, నిదానందొడ్డి గ్రామాలకు సరఫరా ఉండదు.

**తాళ్లరేవు:** చొల్లంగి విద్యుత్ సబ్‌స్టేషన్‌లో పనుల నిమిత్తం ఉదయం 7.30 నుంచి మధ్యాహ్నం 1.30 గంటల వరకు తాళ్లరేవు, పి.మల్లవరం, జార్జిపేట, గాడిమొగ, భైరవపాలెం, పోలేకుర్రు, సీతారామపురం, కోరింగ, పెద,చినబొడ్డువెంకటాయపాలెం, చొల్లంగి, చొల్లంగిపేట, జి.వేమవరం, కొత్తూరు, రామన్నపాలెం, పటవల, శాంతమూల గ్రామాల్లో విద్యుత్ సరఫరా ఉండదని కాకినాడ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ తెలిపారు.

## మొక్కలు నాటాలి : ఉమర్‌ఆలీషా

పిఠాపురం, ఆగస్టు 22: మొక్కలు నాటడమే కాకుండా వాటిని పెంచే బాధ్యతను స్వీకరించాలని విశ్వ విజ్ఞాన విద్యా ఆధ్యాత్మిక పీఠాధిపతి డాక్టర్ ఉమర్‌ఆలీషా సూచించారు. నా మొక్క- నా శ్వాస అనే నినాదంతో ఉమర్‌ఆలీషా రూరల్ డెవలప్‌మెంట్ ట్రస్టు ఆధ్వర్యంలో పిఠాపురం ఆర్‌ఆర్‌బీహెచ్‌ఆర్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో గురువారం ఆయన మొక్కలు నాటే కార్యక్రమాన్ని ప్రారంభించారు. విద్యాసంస్థల్లో మొక్కలు నాటడం ద్వారా విద్యార్థుల్లో పర్యావరణ పరిరక్షణపై ప్రేరణ కలిగించడంతో పాటు వాటిని శ్రద్ధగా పెంచే బాధ్యతను తీసుకుంటారని భావించి ఈ కార్యక్రమానికి శ్రీకారం చుట్టినట్లు ఉమర్‌ఆలీషా సూచించారు. ప్రతిఒక్కరు కనీసం 3 మొక్కలు పెంచాలన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ కేశవరావు, ఉపన్యాసకులు సుందరయ్య, శారద, రామారావు, లైబ్రేరియన్ మహ్మద్ హుస్సేన్, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ అధికారులు దేవరపల్లి కాశీవిశ్వనాథం, బుల్లిప్రసాద్, సురేష్‌కుమార్, హుస్సేన్‌షా పాల్గొన్నారు.

## 'పశువైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి'

పెద్దాపురం, ఆగస్టు 22: పశుసంవర్థకశాఖ, స్వచ్ఛంద సంస్థల ఆధ్వర్యంలో నిర్వహించే ఉచిత పశువైద్య శిబిరాలను పాడి రైతులు సద్వినయోగం చేసుకోవాలని ఆత్మ పీడీ జోతిర్మయి అన్నారు. మండలంలోని కాండ్రకోట గ్రామంలో పశుసంవర్థక శాఖ, శాంతివర్ధన సంస్థ, ఆత్మ సంయుక్త ఆధ్వర్యంలో గురువారం ఉచిత పశువైద్య శిబిరం నిర్వహించారు. పాడి రైతులకు మెరుగైన సేవలందించేందుకు ముందుకొచ్చిన శాంతివర్ధన సంస్థను ఆమె అభినందించారు. శిబిరంలో సుమారు 75 పాడి పశువులకు వైద్యపరీక్షలు చేసి ఉచితంగా మందులు అందచేశారు. కార్యక్రమంలో పశుసంవర్థక శాఖ ఏడీ టి.రామస్వామి, పశువైద్యులు డాక్టర్ రాకేష్, నవీన్, వినోద్, శాంతివర్ధన సంస్థ సీఈవో రఘువీర్, ఏవో వేణు, దుర్గ, వీరబాబు, రాజేంద్ర తదితరులు పాల్గొన్నారు.

## 'ఉద్యోగ భద్రత కల్పించాలి'

సర్పవరం జంక్షన్, ఆగస్టు 22: ప్రభుత్వం నిర్వహిస్తున్న మద్యం దుకాణాల్లో పని చేస్తున్న సిబ్బందికి కూటమి ప్రభుత్వం ఉద్యోగ భద్రత కల్పించాలని ఏపీ స్టేట్ బెవరేజస్ కార్పొరేషన్ కాంట్రాక్ట్ అండ్ అవుట్ సోర్సింగ్ ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోసియేషన్ కాకినాడ జిల్లా సామర్లకోట డిపో సంఘం అధ్యక్షుడు సబ్బతి చిట్టిబాబు డిమాండ్ చేశారు. గురువారం సర్పవరంలో కార్మిక సంక్షేమ భవనంలో నిర్వహించిన జిల్లా సంఘం సమావేశంలో ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వ హయాంలో కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్ విధానంలో శక్తి వంచన లేకుండా పని చేశామన్నారు. కూటమి ప్రభుత్వం తీసుకురాబోయే నూతన మద్యం పాలసీలో తమని భాగస్వామ్యం చేసి ఉద్యోగ భద్రత కల్పించాలని కోరారు. సమావేశంలో పలువురు సభ్యులు పాల్గొన్నారు.

## ఏఐఎఫ్‌టీయూ ప్రతినిధుల ఆందోళన

గొల్లప్రోలు, ఆగస్టు 22: అనకాపల్లి జిల్లా అచ్యుతాపురం సెజ్‌లోని ఎస్సెన్షియా ఫార్మా కంపెనీలో జరిగిన పెను ప్రమాదానికి బాధ్యులైన ఫార్మా కంపెనీ యాజమాన్యంపై హత్యానేరం కింద కేసు నమోదు చేయాలని డిమాండ్ చేస్తూ అఖిల భారత కార్మిక సంఘాల సమాఖ్య(ఏఐఎఫ్‌టీయూ) ఆధ్వర్యంలో గురువారం పట్టణంలో ఆందోళన నిర్వహించారు. మృతులకు నివాళులర్పించారు. ఇటువంటి సంఘటనలు పునరావృతం కాకుండా చర్యలు చేపట్టాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఆందోళనలో ఏఐఎఫ్‌టీయూ ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా అధ్యక్షుడు కుంచే అంజిబాబు, డి.నారాయణమూర్తి, గుడాల చార్లిస్, కేశవరపు వీరన్న, బళ్ల సోమరాజు తదితరులు ఉన్నారు.

**జగ్గంపేట:** అచ్యుతాపురం ఘటనలో ఎస్సెన్షియా ఫార్మా కంపెనీ యాజమాన్యాన్ని అరెస్టుచేయాలని ఐఎఫ్‌టీయూ నేతలు ఏసు,మోహన్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

## డ్వాక్రా యానిమేటర్ అక్రమాలపై విచారణ

తాళ్లరేవు, ఆగస్టు 22: ఉప్పంగల యానిమేటర్(వీవోఏ) కె. భానుకుమారిపై డ్వాక్రా గ్రూపు సభ్యులు చేసిన స్పందన ఫిర్యాదుపై కలెక్టర్ ఆదేశాల మేరకు అసిస్టెంట్ ప్రాజెక్టు మేనేజర్ సన్యాసిరావు, సీసీ రఘురామ్ గురువారం ఉప్పంగల గ్రామంలో శ్రీఆంజనేయ, శ్రీసాయిశక్తి, శ్రీలక్ష్మి గ్రూపు సభ్యులను విచారించారు. డాక్యుమెంట్లు పూర్తి చేయడానికి, రుణమాఫీ డబ్బులకు, బ్యాంకు రుణాలు ఇప్పించేందుకు, ఇచ్చిన తరువాత కూడా యానిమేటర్ డబ్బులు డిమాండ్ చేస్తుందని సభ్యులు చెప్పారు. కార్యక్రమంలో కాళా మంగరాజు, పరంశెట్టి నాగమణి,కాజా మంగమ్మ, గంగాభవాని ఉన్నారు.



# భారీ వర్షం

రహదారులు జలమయం
పొంగిపొర్లిన డ్రెయిన్లు
వివాహ బృందాల అగచాట్లు



పిఠాపురంలో కురుస్తున్న భారీ వర్షం, గొల్లప్రోలులో ఓ వీధిలో నిలిచిన వర్షపు నీరు

పిఠాపురం, ఆగస్టు 22: పట్టణంలో గురువారం భారీవర్షం కురిసింది. ఉదయం గంటన్నర పాటు కుంభవృష్టిగా వర్షం పడడంతో రహదారులు, డ్రెయిన్లు ఏకమయ్యాయి. రథాలపేట సెంటర్, పాతబస్టాండు, ఉప్పాడ బస్టాండు, సినిమా సెంటర్, చర్చి సెంటర్, ఆర్టీసీ కాంప్లెక్సు తదితర ప్రాంతాల్లోని ప్రధాన ఆర్‌అండ్‌బీ రహదారులపై వర్షపు నీరు ప్రవహించింది. సాయంత్రం వరకూ చిరుజల్లులు, స్వల్పంగా వర్షం కురుస్తూనే ఉండడంతో వీధుల్లో రోడ్లపై నీరు నిలిచిపోయింది. ప్రజలు ఈ నీటిలో నుంచే రాకపోకలు సాగించారు. ఉదయం ఏకదాటిగా వర్షం కురుస్తున్న సమయంలో ప్రభుత్వ ప్రవేటు కార్యాలయాలకు వెళ్లే ఉద్యోగులు, పాఠశాలలు, కళాశాలలకు వెళ్లే విద్యార్థులు ఇబ్బందులకు గురయ్యారు. కాగా గురువారం వాతావరణం పూర్తిగా చల్లబడింది.

**గొల్లప్రోలు:** పట్టణంలో కురిసిన భారీవర్షంతో రహదారులు జలమయమయ్యాయి. ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకూ వర్షం కురుస్తూనే ఉంది. మధ్యలో గంటకు పైగా అతి భారీవర్షం కురవడంతో డ్రెయిన్లు పొంగిపొర్లి రోడ్లపైకి నీరు చేరింది. రాయవరం సెంటర్ తదితర ప్రాంతాల్లో 2 అడుగుల ఎత్తున వర్షపునీరు ప్రవహించింది. ఈబీసీ కాలనీ తదితర ప్రాంతాల్లో గృహాల్లోకి వర్షపునీరు చేరింది. గురువారం అధికంగా వివాహ ముహుర్తాలు ఉన్నాయి. దీంతో వివాహాలు చేసుకునేవారు వర్షంతో తీవ్ర ఇబ్బందులు పడ్డారు. కల్యాణమండపాల్లో వివాహాలు జరుపుకునే వారికి స్వల్ప ఇబ్బందులు ఉండగా, ఇంటి వద్ద కార్యక్రమాలు జరుపుకునే వారు వర్షపునీటిలోనే అవస్థలు పడ్డారు.

**కరప:** మండలవ్యాప్తంగా గురువారం భారీ వర్షం కురిసింది. పల్లపు ప్రాంతాలు జలమయమయ్యాయి. కరపమండలపరిషత్ కార్యాలయంతోపాటు మండల విద్యావనరుల కేంద్రం, భవిత కేంద్రం, ఐకేపీ కార్యాలయం, ప్రభుత్వ పాఠశాలలు ముంపునకు గురయ్యాయి. మురుగు డ్రైన్‌లు స్తంభించిపోయి మురుగంతా రోడ్లపైకి చేరింది. ప్రధానరహదారులు, వీధులు జలమయం కావడంతో ప్రజలు రాకపోకలు సాగించడానికి ఇబ్బందులు పడ్డారు. దిక్కులు పిక్కటిల్లే శబ్దాలతో అక్కడక్కడా పిడుగులు పడడంతో ప్రజలు భయభ్రాంతులకు గురయ్యారు.

**తుని రూరల్:** వర్షాలకు పోలవరం ఎడమ కాలువలో నీళ్లు చేరాయి. తుని రూరల్‌లో కొండలకు ఇరువైపులా పూర్తయిన కాలువలోకి వర్షపునీరు దిగడంతో నిండు కుండలా కాలువ దర్శనమిస్తుంది.

**పెద్దాపురం:** పట్టణంలో వర్షం కుండపోతగా కురిసింది. ఉదయం 9 నుంచి సుమారు గంటసేపు వర్షం ఏకధాటిగా కురవడంతో రోడ్లు పూర్తిగా జలమయమయ్యాయి. జనజీవనం స్తంభించింది. పల్లపు ప్రాంతాలు నీటమునిగాయి. వాహనాల రాకపోకలకు తీవ్ర అంతరాయం కలిగింది. విద్యార్థులు, ఉద్యోగులు, ప్రజలు వర్షం కారణంగా అవస్థలు పడ్డారు.

**సామర్లకోట:** పట్టణంలో గురువారం ఎడతెరిపి లేకుండా భారీ వర్షం కురిసింది. లోతట్టు ప్రాంతాలు పూర్తిగా నీటముంపులోకి చేరాయి. భాస్కర్‌నగర్, సాయినగర్ తదితర ప్రాంతాలు మోకాలి లోతు నీటిలో ముంపు బెడదను ఎదుర్కొంటున్నాయి. ముంపు బెడదను నివారించాలని పలువురు కోరుతున్నారు.

జగ్గంపేట: మెట్టప్రాంతంలో భారీ వర్షం కురవడంతో వ్యవసాయానికి అనుకూలంగా ఉందని రైతులు తెలియజేస్తున్నారు. జగ్గంపేట మండలం కాట్రావులపల్లి నగరం, పెద్దాపురం, కిర్లంపూడి, గండేపల్లి మండలాల్లో మెరక ప్రాంతాల్లో వేసిన పంటలకు వర్షం ఉపయోగపడుతుందని రైతులు చెబుతున్నారు.

**కొత్తపల్లి:** మండలంలో గురువారం చిరుజల్లులు పడ్డాయి. ఇటీవల విపరీతమైన ఉక్కపోత, గుబులుతో సతమతమైన ప్రజలు జల్లులతో సేదతీరారు.



పెద్దాపురంలో వర్షపు నీటిలో వాహనాలు



కరప ప్రధాన రహదారిపై నిలిచిన వర్షంనీరు

## చిరంజీవి జన్మదిన వేడుకలు



కరపలో నిత్యావసరాలు అందజేస్తున్న అభిమానులు

కరప, ఆగస్టు 22: కరపలో గురువారం సినీనటుడు చిరంజీవి జన్మదిన వేడుకలు ఘనంగా జరిగాయి. మాజీ సర్పంచ్ పోలిశెట్టి తాతీలు ఆధ్వర్యంలో జనసేన సీనియర్ నేత డాక్టర్ బొండా సూర్యారావు కేక్ కట్‌చేసి అభిమానులకు పంచిపెట్టారు. పారిశుధ్య కార్మికులకు నిత్యావసర సరుకుల కిట్లను అందజేశారు. పలు గ్రామాల్లో వేడుకలను చిరంజీవి అభిమానులు నిర్వహించారు.

**జగ్గంపేట:** పట్టణంలో మెగా ఫ్యాన్స్ ప్రెసిడెంటు గెద్ద బాబురావు ఆధ్వర్యంలో వేడుకల్లో జగ్గంపేట జనసేన ఇన్‌చార్జి తుమ్మలపల్లి రమేష్ అభిమానుల మధ్య కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలిపి స్వీట్లు పంచారు. జగ్గంపేట విష్ణాలయం, శివాలయం వద్ద మొక్కలు నాటారు.

**గండేపల్లి:** మల్లేపల్లిలో జనసైనికులు ఆధ్వర్యంలో జరిగిన వేడుకల్లో జగ్గంపేట జనసేన ఇన్‌చార్జి తుమ్మలపల్లి రమేష్ కేక్ కట్ చేసి స్వీట్లు పంపిణీ చేయడంతో పాటు ఆలయాలు, విద్యాసంస్థల్లో మొక్కలు నాటారు.

**తుని రూరల్:** తుని వృద్ధాశ్రమంలో అన్నదానం, గవర్నమెంట్ ఆసుపత్రిలో మెగా రక్తదాన శిబిరం, తుని టౌన్ 7వ వార్డులో ఉచిత వైద్య శిబిరాన్ని అభిమానులు ఏర్పాటు చేశారు. దంతులూరి శ్రీనివాసరావు, చోడిశెట్టి గణేష్, కోడూరిసురేష్, వంగలపూడి నాగేంద్ర ఉన్నారు.

**గొల్లప్రోలు:** పట్టణంలో ఎస్‌బీఐ ఎదురుగా నూతనంగా ఏర్పాటు చేసిన జనసేన కార్యాలయాన్ని కాకినాడ ఎంపీ ఉదయ్‌శ్రీనివాస్ ప్రారంభించారు. అనంతరం చిరంజీవి పుట్టినరోజు వేడుకల్లో కేక్ కట్ చేశారు.

**సామర్లకోట:** పట్టణంలోని విఘ్నేశ్వరా థియేటర్ ఆవరణలో జనసేన పట్టణాధ్యక్షుడు సరోజా వాసు ఆధ్వర్యంలో మెగా ఫ్యామిలీ అసోసియేషన్ల సభ్యుల సమక్షంలో భారీ కేక్‌ను కట్ చేసి అభిమానులకు పంచారు.

**కిర్లంపూడి:** రామచంద్రపురంలో సర్పంచ్ తుమ్మలపల్లి సాయిగుణశేఖర్ ఆధ్వర్యంలో ఆలయాల వద్ద మొక్కలు నాటారు. బూరుగుపూడిలో జనసైనికులు జగ్గంపేట ఇన్‌చార్జి తుమ్మలపల్లి ఆధ్వర్యంలో వేడుక చేశారు.

## 'పీఆర్'లో అతిథి అధ్యాపకుడి నియామకానికి దరఖాస్తులు

కాకినాడ రూరల్, ఆగస్టు 22: కాకినాడ పీఆర్ ప్రభుత్వ వృత్తివిద్యా జూనియర్ కళాశాలలో అతిథి అధ్యాపకుడి నియామకం కోసం దరఖాస్తులు స్వీకరిస్తున్నట్టు ప్రిన్సిపాల్ ఎం.తిరుపతి తెలిపారు. కళాశాలలోని ఆంగ్ల అధ్యాపకుడి ఉద్యోగానికి ఎంఏ (ఆంగ్లము) పూర్తిచేసిన అభ్యర్థులు అర్హులన్నారు. ఈనెల 24వరకూ దరఖాస్తులు స్వీకరిస్తామని, అభ్యర్థులు కాకినాడ బాలాజీ చెరువు సెంటర్లో గల కళాశాలలో హాజరు కావాలని సూచించారు. దరఖాస్తుచేసిన అభ్యర్థులకు ఈనెల 25న ఉదయం 11 గంటలకు డెమో నిర్వహిస్తామని ప్రిన్సిపాల్ తెలిపారు.

## డ్రంక్ అండ్ డ్రైవ్‌లో పట్టుబడిన వారికి జైలు, జరిమానా

కాకినాడ క్రైం, ఆగస్టు 22: మద్యం తాగి వాహనం నడిపిన 9మందికి కాకినాడ మూడో స్పెషల్ జ్యూడీషియల్ సెకండ్ క్లాస్ మేజిస్ట్రేట్ వి.నరసింహరావు జైలు, జరిమానా విధిస్తూ గురువారం తీర్పుచెప్పారు. కాకినాడ ట్రాఫిక్ వన్, ట్రాఫిక్ టూ పరిధిలో బుధవారం డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులను మొత్తం 9మందిపై నమోదు చేసి కోర్టులో హాజరుపర్చారు. ఇద్దరికి 2రోజుల చొప్పున జైలు శిక్ష, మరో ఏడుగురికి ఒక్కొక్కరికి రూ.10వేల చొప్పున జరిమానా విధిస్తూ న్యాయమూర్తి తీర్పు చెప్పారు.

## కనకదుర్గ ఆలయ శిఖర ప్రతిష్ఠ

కిర్లంపూడి, ఆగస్టు 22: తామరాడలో ఏలేరు నదీ తీరంలో శ్రీ కనకదుర్గాదేవి ఆలయ శిఖర ప్రతిష్ఠ మహోత్సవం గురువారం ఆలయ కమిటీ సభ్యులు ఘనంగా నిర్వహించారు. గణపతి, మండపూజ, హోమాలు, కుంభాభిషేకం చేపట్టారు. కేవం చినవెంకటరమణ, నూకరత్నం, వీరన్న, సత్యవతి, మోజేష్, వెంకటలక్ష్మి, దుర్గబాబు, మేఘన వారి దంపతులు చేతులమీదుగా పూజా కార్యక్రమాలు చేపట్టారు.అనంతరం అన్నదానం చేశారు.

## నేటి నుంచి ధనలక్ష్మీ ఉత్సవాలు

ఏలేశ్వరం, ఆగస్టు 22: యర్రవరంలో శ్రీధనలక్ష్మీ అమ్మవారి ఉత్సవాలు శుక్రవారం నుంచి ప్రారంభిస్తున్నట్టు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. 37వ వార్షికోత్సవం పురస్కరించుకుని ఈనెల 23వ నుంచి సెప్టెంబరు 1వరకు ఆలయ ప్రాంగణంలో కుంకుమ పూజలు, కోలాటం, ముగ్గుల పోటీలు, భోనాలు, శక్తి వేషాలు, అమ్మవారి ఊరేగింపు, భజన కార్యక్రమాలు ఉంటాయన్నారు.

## ప్రతిష్ఠాత్మకంగా గ్రామ సభల నిర్వహణ

కాకినాడ రూరల్ ఎమ్మెల్యే నానాజీ
బియ్యం దొంగలను వదిలే ప్రసక్తే లేదు



సమావేశంలో మాట్లాడుతున్న నానాజీ

సర్పవరం జంక్షన్, ఆగస్టు 22: రాష్ట్ర వ్యాప్తంగా గ్రామసభలను కూటమి ప్రభుత్వం అత్యంత ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించేందుకు అధికారులు ఏర్పాట్లు చేశారని, ప్రజలే కాదు ప్రతిపక్షాలు కూడా గ్రామసభలకు వచ్చి భాగస్వామ్యం కావాలని కాకినాడ రూరల్ ఎమ్మెల్యే పంతం నానాజీ అన్నారు. గురువారం వలసపాకల గంగరాజునగర్ జనసేన పార్టీ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ పేదలకు చెందాల్సిన బియ్యాన్ని అక్రమంగా విదేశాలకు ఎగుమతి చేసి కోట్లాది రూపాయలు గడించిన మాజీ ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి దేశద్రోహి కింద లెక్క అన్నారు. ద్వారంపూడి అక్రమ బియ్యం దందాలపై మంత్రి నాదెండ్ల తనిఖీలు చేసి 57వేల మెట్రిక్ టన్నులను గుర్తిస్తే ఇందులో సుమారు 26 వేల మెట్రిక్ టన్నుల పీడీఎస్ బియ్యంగా గుర్తించడం జరిగిందన్నారు. ఐదేళ్ల వైసీపీ పాలనలో జగన్ అండతో ద్వారంపూడి కాకినాడ పోర్టును అక్రమ బియ్యం రవాణా, గంజాయి, మత్తు పదార్థాలకే కేరాఫ్ అడ్రాస్‌గా మార్చేశారని ఆరోపించారు. దొంగే దొంగ దొంగ అన్నచందంగా పోర్టు చెక్‌పోస్టులతో ఎగుమతుల్లో కార్మికుల ఉపాధికి భంగం వాటిల్లుతుందంటూ పిచ్చికూతలు కూస్తున్నారన్నారు. కాకినాడ పోర్టును ద్వారంపూడితో పాటూ కన్నబాబులు దోచేశారని ఆరోపించారు. దొంగ వ్యాపారాలతో కాకినాడ పోర్టు పరువు తీసింది ద్వారంపూడి అన్నారు. బియ్యం దొంగలను ఎట్టి పరిస్థితుల్లో వదిలే ప్రసక్తేలేదన్నారు. బియ్యం దొంగపై దర్యాప్తు కొనసాగుతుందని న్యాయపరంగా తొందర్లోనే అరెస్టుకు రంగం సిద్ధమవుతుందన్నారు. సమావేశంలో కూటమి నాయకులు వాసిరెడ్డి ఏసుదాసు, రాందేవు సీతయ్యదొర పాల్గొన్నారు.

## అందరూ హాజరవ్వాలి : రమేష్

జగ్గంపేట, ఆగస్టు 22: గ్రామసభలకు నియోజకవర్గ జనసైనికులు, కార్యకర్తలందరూ హాజరవ్వాలని జగ్గంపేట జనసేన ఇన్‌చార్జి తుమ్మలపల్లి రమేష్ కోరారు. సీసీరోడ్లు, డ్రైనేజీలు, మౌలిక వసతులు, పంట కాలువలు పూడికతీయడం వంటి సమస్యలపై సభల్లో చర్చించాలన్నారు.

## గ్రామసభల ఫ్లెక్సీలపై అభ్యంతరం

కరప, ఆగస్టు 22: మండలంలో శుక్రవారం నుంచి గ్రామసభలను పకడ్బందీగా చేపట్టడానికి అధికారులు ఏర్పాట్లు చేశారు. ఈ ఫ్లెక్సీలపై సీఎం, డిప్యూటీ సీఎం, ఎంపీ, ఎమ్మెల్యే, జడ్పీటీసీ, ఎంపీపీ ఫొటోలను అధికారులు ముద్రించారు. అయితే సర్పంచ్ అధ్యక్షతన జరిగే ఈ గ్రామసభల ఫ్లెక్సీలపై సర్పంచ్ ఫొటో లేకపోవడం వివాదాస్పదమయ్యింది. దీంతో వలసపాకల సర్పంచ్ వాసంశెట్టి రామారావు కొంత మంది మహిళా సర్పంచ్‌ల భర్తలతో కలిసి గురువారం ఎంపీడీవో కొంకి అప్పారావును కలిశారు. పంచాయతీ నిధులను వినియోగించి నిర్వహించనున్న ఈ గ్రామసభల్లో సర్పంచ్ ఫొటో లేకపోవడం దారుణమని, ప్రోటోకాల్ పాటించకపోతే గ్రామసభలను బాయ్‌కాట్ చేస్తామని స్పష్టం చేశారు. చివరకు సర్పంచ్ ఫొటోలను కూడా ఫ్లెక్సీల్లో పొందుపరచాలని ఎంపీడీవో ఆయా గ్రామాల కార్యదర్శులకు సూచించడంతో వివాదం సద్దుమణిగింది.

## సామర్లకోట కమిషనర్‌గా శ్రీవిద్య



సామర్లకోట, ఆగస్టు 22: సామర్లకోట మున్సిపల్ కమిషనర్‌గా ఏ.శ్రీవిద్యను నియమిస్తూ ప్రభుత్వ ప్రిన్సిపల్ కార్యదర్శి అనిల్ కుమార్ సింఘాల్ నుంచి ఉత్తర్వులు జారీ అయ్యాయి. ఆమె భీమవరం మున్సిపాల్టీలో సహాయ కమిషనర్‌గా పనిచేస్తున్నారు. మరో 3రోజుల్లో సామర్లకోట చేరుకుని బాధ్యతలు స్వీకరించనున్నట్టు గురువారం రాత్రి ఫోన్‌ద్వారా ఆంధ్రజ్యోతికి తెలిపారు. ఇప్పటి వరకూ కమిషనర్‌గా పనిచేసిన జాస్తి రామారావు గుంటూరు నగ రపాలక సంస్థలో శానిటరీ ఇన్‌స్పెక్టర్‌గా తన పూర్వపు స్థానంలోకి బదిలీ చేస్తూ ఉత్తర్వులు జారీ అయ్యాయి.

## త్రీటౌన్ సీఐ బాధ్యతల స్వీకరణ



కాకినాడ క్రైం, ఆగస్టు 22: కాకినాడ త్రీటౌన్ పోలీస్‌స్టేషన్ ఎస్‌హెచ్‌ఓ(సీఐ)గా కేవీవీ.సత్యనారాయణ గురువారం బాధ్యతలు స్వీకరించారు. 2009 ఎస్ఐ బ్యాచ్‌కు చెందిన ఆయన కాకినాడ టూటౌన్, తిమ్మాపురం, యు.కొత్తపల్లి తదితర పోలీస్‌స్టేషన్‌ల్లో ఎస్ఐగా పనిచేశారు. 2021లో సీఐగా పదోన్నతి పొంది కాకినాడ ఎస్‌బీ, సీసీఎస్ ఏలూరు జిల్లా కుక్కుటూరు సీఐగా పనిచేశారు. అనంతరం రాజమహేంద్రవరం, ప్రకాష్‌నగర్ సీఐగా పనిచేస్తూ సాధారణ బదిలీల్లో భాగంగా కాకినాడ త్రీటౌన్‌కు వచ్చారు.

## యనమలను కలిసిన బీజేపీ శ్రేణులు

తుని రూరల్, ఆగస్టు 22: మాజీ మంత్రి యనమల రామకృష్ణుడిని నియోజకవర్గ బీజేపీ శ్రేణులు మర్యాదపూర్వకంగా కలిశారు. గ్రామాల్లో పలు సమస్యలు, అభివృద్ధి కార్యక్రమాలపై యనమలతో చర్చించారు. సమన్వయంతో పని చేసి నియోజకవర్గ అభివృద్ధికి పాటుపడాలని ఆయన సూచించారు

## 'తప్పుడు ప్రచారాన్ని మత్స్యకారులు నమ్మొద్దు'

తాళ్లరేవు, ఆగస్టు 22: నియోజకవర్గంలో గత 2రోజులుగా ఓఎన్‌జీసీ నష్టపరిహారంపై కొందరు చేస్తున్న తప్పుడు ప్రచారాన్ని మత్స్యకార సోదరులు నమ్మవద్దని ముమ్మిడివరం ఎమ్మెల్యే దాట్ల బుచ్చిబాబు గురువారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఈనెల 27న నియోజకవర్గంలోని మురమళ్లలో పర్యటించి నష్టపరిహారం నిధులు విడుదల చేస్తున్నారని వస్తున్న వార్తల్లో నిజంలేదని, కొంతమంది కావాలని తప్పుడు ప్రచారం చేస్తున్నారన్నారు. ఓఎన్‌జీసీ సంస్థతో నష్టపరిహారం చెల్లింపు విషయమై చర్చలు కొనసాగుతున్నాయని, చర్చల అనంతరం పూర్తివిషయాలను అందరికీ తెలియజేస్తామని, మత్స్యకార సోదరులంతా గమనించాలని కోరారు.

## 'ఫిర్యాదులపై సకాలంలో స్పందించాలి'

కార్పొరేషన్ (కాకినాడ), ఆగస్టు 22: మీ కోసం-ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థకు వచ్చే ఫిర్యాదులను నిశితంగా పరిశీలించి పరిష్కారానికి సకాలంలో స్పందించాలని కమిషనర్ భావన అధికారులను ఆదేశించారు. ప్రజా పరిష్కార ఫిర్యాదులపై గురువారం కమిషనర్ నగరపాలక సంస్థ సెక్షన్ విభాగాధిపతులతో సమావేశం నిర్వహించారు. ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థకు వచ్చే వినతులను స్వీయ పరిశీలన అనంతరం మాత్రమే క్లోజ్ చేయాలని అధికారులను సూచించారు.

## కారు ఢీకొని ముగ్గురు విద్యార్థులకు గాయాలు

గండేపల్లి, ఆగస్టు 22: మండలంలోని సూరంపాలెం రామేశ్వర పేటలో ఉన్న ఏడీబీ రోడ్డులో గురువారం రాత్రి జరిగిన రోడ్డ ప్రమాదంలో ఓ ప్రైవేట్ కళాశాలలో చదువుకుంటున్న ముగ్గురు విద్యార్థులకు గాయాలయ్యాయి. స్థానికుల సమచారం ప్రకారం.. టిఫిన్ చేసేందుకు సెంటర్లోకి వచ్చి విద్యార్థులను పెద్దాపురం వైపు నుంచి రాజమహేంద్రవరం వైపు వెళ్తున్న కారు అదుపుతప్పి ఢీకొనడంతో ఇద్దరు విద్యార్థులకు స్వల్ప గాయాలు కాగా ఒకరికి తలకు బలమైన గాయమైంది. వారిని పెద్దాపురం ఆసుపత్రికి తరలించారు. అయితే పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

## అభివృద్ధికి సహకారమందిస్తా : ఎంపీ



ఎంపీని సన్మానిస్తున్న ఎమ్మెల్యే సత్యప్రభ

ప్రత్తిపాడు, ఆగస్టు 22: ప్రత్తిపాడు నియోజకవర్గ అభివృద్ధికి తన వంతు సహాయ సహకారాలు అందిస్తానని కాకినాడ ఎంపీ తంగెళ్ల ఉదయ్‌శ్రీనివాస్ చెప్పారు. గురువారం ఆయన ప్రత్తిపాడు విచ్చేసి ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభరాజాను మర్యాదపూర్వకంగా కలిశారు. ఎంపీగా ప్రమాణస్వీకారం చేసిన అనంతరం తొలిసారిగా తన స్వగృహానికి విచ్చేసిన ఎంపీకి ఎమ్మెల్యే శాలువా కప్పి సన్మానించారు. నియోజకవర్గ పరిస్థితులపై వారు చర్చించారు. కార్యక్రమంలో జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి వరుపుల తమ్మయ్యబాబు, టీడీపీ నాయకులు కొమ్ముల కన్నబాబు, యాళ్ళ జగదీష్, అంబటి రాంబాబు, వెలుగుల నాని, బీడా నానాజీ తదితరులున్నారు.

## ఆయిల్ షాపులపై దాడులు

తొండంగి, ఆగస్టు 22: బెండపూడి శివారు తమ్మయ్యపేట వద్ద అక్రమంగా వాహనాల నుంచి ఆయిల్ తొలగించే షాపులపై గురువారం తొండంగి పోలీసులు దాడులు నిర్వహించారు. ఎస్ఐ జగన్మోహన్ ఆదేశాల మేరకు హెడ్ కానిస్టేబుల్ పాండు రంగా, కానిస్టేబుళ్లు సతీష్, ఉదయ్, మణికంఠలు షాపుల నిర్వహణ కోసం ఏర్పాటు చేసుకున్న పరదాలు, షాపులను తొలగించారు. రెండు షాపులకు సంబంధించి ఇద్దరిపై కేసు నమోదు చేసి 70 లీటర్ల ఆయిల్ స్వాధీనం చేసుకున్నారు. వాహనాల నుంచి ఆయిల్ తొలగించేందుకు వినియోగించే టిన్నులు ఇతర పరికరాలను పట్టుకున్నారు.

**ప్రత్తిపాడు:** ప్రత్తిపాడు పోలీస్‌స్టేషన్ పరిధిలో అక్రమంగా ఉన్న ఆయిల్ దుకాణాలపై ఎస్ఐ ఎం.పవన్‌కుమార్ ఆధ్వర్యంలో దాడి చేసి హైవే వెంబడి ఉన్న పలు దుకాణాలు మూయించివేసి నిర్వాహకులపై కేసులు నమోదు చేశారు.

**తుని రూరల్:** 16వ నెంబరు జాతీయ రహదారిపై పయనిస్తున్న వాహనాల నుంచి ఆయిల్ కొనుగోలు చేస్తున్నారన్న సమాచారంతో ఎస్ఐ బి.కృష్ణమాచార్యులు ఆధ్వర్యంలో తనిఖీలు చేపట్టారు. ఆయిల్ స్థావరాల షెడ్‌లను తొలగించారు.

## బ్రిడ్జి నిర్మాణానికి స్థల పరిశీలన

సామర్లకోట, ఆగస్టు 22: సామర్లకోట మీదుగా కాకినాడ తదితర ప్రాంతాలకు వెళ్లే రహదారిలో రైల్వే గేట్ కారణంగా తరచూ ట్రాఫిక్ స్తంభన ఏర్పడుతున్నందున రెండో ఫ్లైఓవర్ బ్రిడ్జి నిర్మాణానికి స్థల పరిశీలన పెద్దాపురం ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప, రైల్వే మున్సిపల్ అధికారులతో కలిసి గురువారం చేపట్టారు. మున్సిపల్ కమిషనర్ జాస్తి రామారావు తదితర అధికారులు, కూటమి నాయకులున్నారు.

## రేపు ఉద్యోగ మేళా

ఏలేశ్వరం, ఆగస్టు 22: పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శనివారం నిరుద్యోగులకు ఉద్యోగ మేళా నిర్వహిస్తున్నట్టు ప్రిన్సిపాల్ డి.సునీత గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. పదో తరగతి, ఐటీఐ, ఇంటర్, డిప్లమా, డిగ్రీ విద్యార్హత కలిగినవారు తమ ఒరిజినల్ సర్టిఫికెట్లతో శనివారం ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 5గంటల వరకు కళాశాల ప్రాంగణంలో బెంగుళూరు సుప్రజిత్ ఇంజనీరింగ్ లిమిటెడ్, బాగ్ బాస్కట్, చెన్నై మదర్ సన్ సుమి వైరింగ్ లిమిటెడ్ కంపెనీల ఇంటర్వ్యూలకు హాజరుకావాలని కోరారు.

## నల్లపూసలు బహూకరణ

కిర్లంపూడి, ఆగస్టు 22: చిల్లంగి గ్రామంలో శివాలయంలో అన్నపూర్ణదేవి అమ్మవారికి కాసు బంగారంతో నల్లపూసలు, పట్టు వస్త్రాలను గురువారం సమర్పించారు. ఆరాద్యుల వెంకట సీతారామశాస్త్రి, పద్మావతి దంపతులు తమ మనుమరాలు ధాత్రి నైషిక పుట్టినరోజు సందర్భంగా సమర్పించారు.

## మొక్కలు నాటిన టీడీపీ నాయకులు

ప్రత్తిపాడు, ఆగస్టు 22: ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ రాజా పిలుపుమేరకు గజ్జనపూడిలో అమ్మ పేరుతో మొక్క నాటే కార్యక్రమాన్ని గ్రామ టీడీపీ నాయకులు పల్లా గోపి, దాకారపు కృష్ణ ఆధ్వర్యంలో ప్రారంభించారు. మాజీ సర్పంచ్ సింగిడి వెంకటేష్, జక్క సత్యనారాయణ, ఈగల చక్రరావు, గారా గంగరాజు, చింతపల్లి నూకరావు, రామకృష్ణ ఉన్నారు.



## ఏలేశ్వరం నగర్ పంచాయితీ

### హెచ్చరిక

ప్రజలకు తెలియచేయడము ఏమనగా ఈ క్రింది జాబితాలో పొందుపరిచిన స్థలము/ప్లాట్లు ఎటువంటి అనుమతులు లేకుండా అనధికారముగా లే-అవుట్లు వేసియున్నారు.

| క్ర.సం. | అనధికార లే-అవుట్ పేరు | విస్తీర్ణము (ఎకరాలలో) | సర్వేనెం | గ్రామము | మండలం |
|---|---|---|---|---|---|
| 01 | కిలపర్తి విజయ లేఅవుట్ | 6.00 | 409/2 | ఏలేశ్వరం | ఏలేశ్వరం |
| 02 | లింగవరం కాలనీ లేఅవుట్ | 1.95 | 440/4 | ఏలేశ్వరం | ఏలేశ్వరం |
| 03 | అప్పారావు లేఅవుట్ | 0.70 | 397 | ఏలేశ్వరం | ఏలేశ్వరం |
| 04 | వాగు రవికుమార్ మరియు ఇతరులు లేఅవుట్ | 1.10 | 385 | ఏలేశ్వరం | ఏలేశ్వరం |
| 05 | ఏఎంజి లేఅవుట్ | 10.00 | 187/2 | ఏలేశ్వరం | ఏలేశ్వరం |
| 06 | అలమండ లేఅవుట్ | 2.00 | 451 | ఏలేశ్వరం | ఏలేశ్వరం |
| 07 | మూర్తి లేఅవుట్ | 1.50 | 460 | ఏలేశ్వరం | ఏలేశ్వరం |

కావున పైన తెలియపరచిన లే-అవుట్ నందు స్థలము లేక ప్లాట్లు కొనుగోలు చేయుట చట్ట విరుద్ధము మరియు ఈ ప్లాట్లు అమ్మకము, కొనుగోలుకు వీలు లేకుండా రిజిస్ట్రేషన్ చేయబడవు మరియు ఎటువంటి భవన నిర్మాణ అనుమతులు మంజూరు చేయబడవు. మౌలిక వసతులు అనగా రోడ్లు, కరెంట్, నీరు, డ్రైనేజ్ సదుపాయాలు కలిపించబడవు దీనిని గమనించవలసిందిగా విజ్ఞప్తి.

గమనిక: అనధికారముగా లే అవుట్ వేసి మరియు అమ్మకాలు చేయుచున్న స్థల యజమానులు లేదా డెవలపర్ల పైన చట్టపరమైన చర్యలు తీసుకొనబడతాయి.

కమిషనర్
ఏలేశ్వరం నగర పంచాయితీ